

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

11.08.2026
మంగళవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 90
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

# రేవంత్ రేవంత్ రెడ్డి వరుణ యాగం!





రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి, జలాశయాలు సమృద్ధిగా నిండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం నిర్వహించిన మహా 'వరుణ యాగం'లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగార్జునసాగర్ తీరంలోని విజయ విహార్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంరక్షణలో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, 108 మంది వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ 11 హోమగుండాల ద్వారా ఈ యాగ క్రతువు సాగింది. అనంతరం నిర్వహించిన మహత్తర 'సకల పూర్ణాహుతి' క్రతువులో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని, స్వామివారికి పట్టువస్త్రాలు, హవిస్సులను సమర్పించి రాష్ట్ర ప్రజల సంక్షేమం, పాడిపంటల అభివృద్ధి కోసం ప్రార్థించారు.

## రాష్ట్ర గీతంపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం

- కేంద్రానికి తమిళనాడు సీఎం విజయ్ సవాల్
- తమిళ్ తాయ్ వాళ్తు చివరిగా ప్లే చేయడంపై విమర్శలు

**చెన్నై, ఆగస్ట్ 10, అనంజత జనశక్తి న్యూస్**

ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయ్ వాళ్తు' ముందు ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. అధికారిక కార్యక్రమాల్లో ప్రారంభ గీతాల క్రమంలో జాతీయ గీతం 'వందేమాతరం'ను మొదటగా ప్లే చేయాలన్న కేంద్రం ఆదేశానికి ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ విసిరిన సవాలుగా దీనిని పరిగణిస్తున్నారు.

2లో..

## ఢిల్లీలోని జేఎన్‌యూలో 'ఫ్రీ ఉమర్ ఖాలిద్' నినాదాలు

- మరోసారి వివాదంలోకి వర్సిటీ
- SSS-2 భవనం బయట ధర్నా



**న్యూఢిల్లీ, ఆగస్టు 10, అనంత జనశక్తి న్యూస్**

ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ మరోసారి వివాదంలోకి వచ్చింది. సోమవారం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉమర్ ఖాలిద్ రచించిన పుస్తకంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా JNU విద్యార్థి సంఘం నేతలు ఉమర్ ఖాలిద్ విడుదలను డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

2లో..

# మీ భూమి.. మీ హక్కు

- భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
- అసైన్డ్ ల్యాండ్స్‌పై కీలక నిర్ణయం
- 22ఏ నుంచి మాజీ సైనికుల భూముల తొలగింపు
- సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటన
- మాజీ సైనికులతో సీఎం సమావేశం
- డీ నోటిఫికేషన్ ప్రక్రియను సులభతరం
- ఆర్డీఓకు అధికారాలు కల్పించాలని ఆదేశం



**ఏలూరు, ఆగస్ట్ 10, అనంత జనశక్తి న్యూస్**

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో మీ భూమిమీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. మొదట స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ 22ఏ బాధితులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ భూ, రెవెన్యూ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మాజీ సైనికులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. ఉద్యోగ విరమణ అనంతరం తమకు ప్రభుత్వం అందించిన భూములు 22ఏ జాబితాలో చేర్చడంతో ఎదురవుతున్న ఇబ్బందులను వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను విన్న సీఎం చంద్రబాబు.. సంబంధిత భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అదే విధంగా డీ నోటిఫికేషన్ ప్రక్రియను సులభతరం చేసేలా ఆర్డీఓకు అధికారాలను కల్పించాలని సూచించారు.

అలాగే అసైన్డ్ భూములను పట్టా భూములుగా వర్గీకరించే ప్రక్రియను చేపట్టాలని అధికారులను ఆదేశించారు చంద్రబాబు. ముఖ్యమంత్రి ఆదేశాలతో తమ భూ సమస్యలకు పరిష్కారం లభించడంతో మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

కొన్నేళ్లుగా తాము ఎదుర్కొంటున్న భూ సమస్యలను ముఖ్యమంత్రికి లబ్ధిదారులు వివరించారు. గతంలో ఎన్నిసార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం ద్వారా తమ భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. భాస్కరరావుపేట, వైవాక, గురవయ్యపాలెం, ఉనికిలి, కలిదిండి గ్రామస్తులతో సీఎం మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సీఎం ఆదేశాలతో అధికారులు ఉనికిలి, కలిదిండి, వైవాకలోని 830 గ్రామాలకు సంబంధించి 2,745 ఎకరాలను రిజిస్ట్రేషన్‌కు విముక్తి కలిగించారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో 4,977 ఎకరాలు 22ఏ నుంచి ప్రభుత్వం తొలగించింది. ఈ ప్రక్రియ అనంతరం సీఎం చంద్రబాబు నేరుగా లబ్ధిదారులకు 1బి అడంగల్ ప్రతులను అందజేశారు. భూ సమస్యలను స్వయంగా విని, సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చి సమస్య పరిష్కరించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

6లో..

## విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యలపై చర్చకు సిద్ధం

- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు
- విద్యార్థుల ఉద్యమానికి సంబంధించిన...
- ప్రతి అంశంపైనా చర్చించేందుకు రెడీ

2లో..



## ఆలోచన చేయలేని ప్రభుత్వం

- చర్చ చేయలేని ప్రతిపక్షం
- ప్రజలకు వరమా.. శాపమా?
- వైసీపీ మాజీ విజయసాయిరెడ్డి ఆగ్రహం



2లో..

## భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దు

గోవింద నామాలను అపహాస్యం చేయొద్దు 2లో..

రాజకీయ ప్రయోజనాల కోసం దిగజారొద్దు: పవన్



**అమరావతి, ఆగస్ట్ 10, అనంతజనశక్తి న్యూస్**

డీఎస్సీ 2025లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ నెల్లూరులో వైసీపీ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు వివాదాస్పదమయ్యాయి. ఈ రిలే నిరాహార దీక్షలలో వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి.. శ్రీవారి గోవింద నామాలను అపహాస్యం చేశారని కూటమి శ్రేణులు, సోషల్ మీడియాలో కొంతమంది నెటిజన్లు ఆరోపిస్తున్నారు.

## ట్రాక్టర్ పై నుంచి పడబోయిన నన్ను పెద్ది కాపాడిండు

- వరంగల్‌లో ఈ ఘటన జరిగింది
- హరీశ్ రావు భావోద్వేగం
- నేను భూమి మీద పడ్తుంటే పట్టుకున్నాడు
- సుదర్శన్ రెడ్డి నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లిండు

2లో..



## వైసీపీ రాజకీయ హత్యలకు పాల్పడుతోంది

- మంత్రి టీజీ భరత్ ఆగ్రహం
- కర్నూలు వైసీపీ రౌడీ మూకల అరాచకాలు
- ఇంతియాజ్‌ను దారుణంగా హత్య చేశారు
- పోలీసులు సీరియస్‌గా ఈ కేసును తీసుకోవాలి

6లో..

## పోలీసు బల ప్రయోగానికి దిగడంపై గుస్సా

- వాళ్లు దోషులైనా లేదా
- అసమర్థులైనా అయ్యుండాలి
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ
- పార్లమెంటుకు విద్యార్థుల ర్యాలీ సందర్భంగా..

6లో..

# 650 అడుగుల ఎత్తులో త్రివర్ణ పతాకం

- ఎగిరిన జాతీయ జెండా
- 50 ఏళ్ల తర్వాత కర్రెగుట్టపై తొలిసారి
- డీజీపీ సీవీ ఆనంద్ హాజరు
- ఒకప్పుడు మావోయిస్టులకు ప్రధాన స్థావరం
- అత్యంత ప్రమాదకర ప్రాంతంగా ఉన్న కర్రెగుట్ట

6లో..



**హైదరాబాద్, ఆగస్ట్ 10, అనంత జనశక్తి న్యూస్**

ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న కర్రెగుట్టలు ఇప్పుడు మార్పు దిశగా అడుగులు వేస్తున్నాయి.దశాబ్దాలుగా సాధారణ ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు దాదాపు అందనంత ప్రాంతంగా ఉన్న ఈ కొండల్లో తొలిసారిగా త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. స్వాతంత్ర్య దినోత్సవానికి ఐదు రోజుల ముందే తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కర్రెగుట్టలపై 650 అడుగుల ఎత్తులో కర్రెగుట్టల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని ఈ ప్రాంతంలో సుమారు 50 ఏళ్ల తర్వాత తెలంగాణ వైపుతొలిసారి జాతీయ జెండా ఎగరడం విశేషంగా నిలిచింది.

## ఎంతకాలం బతికినం అనేది కాదు

- ఎట్లా బతికినం అనేది ముఖ్యం
- పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతాం
- నర్సంపేట మెడికల్ కాలేజీకి..
- మాజీ మంత్రి కేటీఆర్ కామెంట్



2లో..




# ఢిల్లీలోని జేఎన్‌యూలో ‘ఫ్రీ ఉమర్ ఖాలిద్’ నినాదాలు

(మొదటి పేజీ తరువాయి)

SSS2 భవనం బయట నిర్వహించిన కార్యక్రమంలో ‘ఉమర్ ఖాలిద్‌ను విడుదల చేయాలి’, ‘జైలు తాళాలు బద్దలవుతాయి.. సహచరులంతా విడుదలవుతారు’ వంటి నినాదాలు చేశారు. దీనికి వ్యతిరేకించిన ఏబీవీపీ మద్దతుదారులు కూడా నినాదాలు చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పుస్తకంపై చర్చ కోసం ఆడిటోరియంను ముందుగా బుక్ చేసుకున్నప్పటికీ, జేఎన్‌యూ పరిపాలన చివరి నిమిషంలో అనుమతిని రద్దు చేసింది. అయినప్పటికీ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించిన విద్యార్థి సంఘం.. SSS2 భవనం బయట చర్చను కొనసాగించింది. వందలాది మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపింది. కార్యక్రమాన్ని మద్దతుదారులు అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించింది. స్పీకర్ నుంచి మైక్రోఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించడంతో పాటు ప్యానెలిస్టులతో దురుసుగా ప్రవర్తించారని విద్యార్థి సంఘం నాయకులు పేర్కొంది. అయితే ఈ ఆరోపణలపై ABVP లేదా JNU పరిపాలన యంత్రాంగం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఈ ఘటన అనంతరం JNUSU ఓ ప్రకటన విడుదల చేసింది. యూనివర్సిటీలో చర్చ, వాదన, భిన్నాభిప్రాయాలకు ఉన్న స్థలాన్ని పరిరక్షించేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపింది. ఉమర్ ఖాలిద్‌తో పాటు తాము ‘రాజకీయ ఖైదీలు’గా భావించే వారికి మద్దతు కొనసాగిస్తామని పేర్కొంది. ABVPపై ద్వేషం, హింసను ప్రోత్సహిస్తూ విద్యా చర్చలను అడ్డుకుంటోందని ఆరోపించింది. ఉమర్ ఖాలిద్ అంశంపై JNUలో మరోసారి నినాదాలు, నిరసనలు చోటుచేసుకోవడంతో క్యాంపస్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

## ట్రాక్టర్ పై నుంచి పడబోయిన

# నన్ను పెద్ది కాపాడిండు



**హైదరాబాద్, ఆగస్ట్ 10, అనంత జనశక్తి న్యూస్**

నల్లబెల్లిలో దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పాల్గొని నివాళులు అర్పించారు. సంతాప సభలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డితో తనకున్న జ్ఞాపకాలు గుర్తు చేసుకొని కన్నీళ్లు పెట్టుకున్నారు. మొన్న పెద్ది సుదర్శన్ రెడ్డి ఆస్పత్రిలో పడితే నేను, కేటీఆర్ ఆగమేఘాల మీద పరుగెత్తుకుంటూ వచ్చాం. వచ్చే సరికి ఆస్పత్రి చూస్తే నాకొక పాత జ్ఞాపకం గుర్తొచ్చింది. ఒక ఉద్యమకారుడు తెలంగాణలో ఆత్మహత్య చేసుకుంటే డీసీఎంపై ఆ అమరుడి అంతిమయాత్ర జరుగుతుంది. ఆ అంతిమ యాత్ర జరుగుతుంటే వరంగల్‌లోని అమరవీరులస్థూపం వద్ద పోలీసులకు, మనకు మధ్య బాగా ఘర్షణ అయింది. ఆ ఘర్షణలో నేను డీసీఎంపై నుంచి కిందపడ్డానన్నారు. డీసీఎంపై నుంచి కిందపడ్డప్పుడు నన్ను పట్టుకున్నది పెద్ది సుదర్శన్ రెడ్డి. నేను భూమి మీద పడాలి. కానీ నేను ఆయన చేతుల పడి కిందపడ్డా ఆరోజు. వెంటనే సుదర్శన్ రెడ్డి నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లిండు. ఆ రోజు ఏ ఆస్పత్రికైతే సుదర్శన్ రెడ్డి నన్ను తీసుకపోయిండో.. పాపం ఆ ఆస్పత్రిలో సుదర్శన్‌రెడ్డిని చివరి చూపు కూడా చూస్తానని కలలు కూడా కనలేదు. అప్పుడు నాకు దెబ్బతాకితే ఆగమేఘాల మీద సుదర్శన్ రెడ్డి నన్ను ఆ ఆస్పత్రికి తీసుకపోయిండు. పాపం సుదర్శన్ రెడ్డి చివరి దశలో ఆ ఆస్పత్రిలో ఉన్నడని కన్నీంటి పర్యంతమయ్యారు.



# ఎంతకాలం బతికినం అనేది కాదు

**హైదరాబాద్, ఆగస్ట్ 10, అనంతజనశక్తి న్యూస్**

ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం : అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు. లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారుఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు.



# రాష్ట్ర గీతంపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం

(మొదటి పేజీ తరువాయి)



ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విజయ్.. రాష్ట్రంలో తమిళ గీతానికే అత్యంత ప్రాధాన్యత ఉండాలని అన్నారు. సభలో ఈ తీర్మానానికి ప్రతిపక్ష పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలు మద్దతు తెలిపాయి. ఈ తీర్మానం ఆమోదం పొందిందని, దీని అమలుకు తదుపరి అనుమతులు అవసరం లేదని తమిళనాడు స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ప్రకటించారు.

**విజయ్ భావోద్వేగ ప్రసంగం**

తీర్మానం ప్రవేశపెట్టిన అనంతరం సీఎం విజయ్ ప్రసంగిస్తూ.. రాష్ట్ర భాషా, సాంస్కృతిక హక్కుల విషయంలో తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని తేల్చి చెప్పారు. ‘‘తమిళం కేవలం ఒక భాష మాత్రమే కాదు ఇది మా జీవనాడి, భావోద్వేగం అని పేర్కొంటూ మాతృభాష అమ్మ అంత పవిత్రమైనది’’ అని ఆయన ఉద్ఘాటించారు. ‘‘తమిళం అంటే ఆత్మగౌరవం, తమిళం అంటే శక్తి. 'తమిళం' అనే పదం ఉచ్చరించగానే తమిళనాడంతా ఒక్కటై నిలబడుతుంది. తమిళనాడులో ‘తమిళ్ తాయ్ వాళ్తు’ గీతానికే మొదటి స్థానం దక్కాలి. దానికి ఆ స్థానాన్ని ఇవ్వడం మన హక్కు’’ అని సీఎం విజయ్ అన్నారు. తమిళనాడులోని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో జరిగే కార్యక్రమాల ప్రారంభంలో ముందుగా రాష్ట్ర గీతాన్నే ఆలపించాలని ఈ తీర్మానం నిర్దేశిస్తోంది.

**కేంద్రం మార్గదర్శకాలతో వివాదం**

కాగా, ఈ ఏడాది జనవరిలో కేంద్ర హోం శాఖ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం.. ప్రభుత్వ కార్యక్రమాల్లో ముందుగా జాతీయ గేయాన్ని (వందేమాతరం), జాతీయ గీతాన్ని (జనగణమన) ప్లే చేయాలి. ఇటీవల జులైలో ఇచ్చిన నోట్‌లో ఈ ఆదేశాలను తప్పక పాటించాలని రాష్ట్రాలకు సూచించింది. ‘రాష్ట్ర గీతాన్ని జాతీయ గేయం లేదా జాతీయ గీతంతో కలిపి పాడేటప్పుడు... ముందుగా జాతీయ గేయం, ఆ తర్వాత జాతీయ గీతం ఆలపించాలి’ అని అందులో పేర్కొంది. తమిళనాడులో 1970లోనే ప్రభుత్వ కార్యక్రమాల్లో రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయ్ వాళ్తు'ను తప్పనిసరి చేశారు. అప్పటి నుంచి అధికారిక కార్యక్రమాల్లో ఈ గీతాన్ని ముందే ఆలపించడం ఒక సాంప్రదాయంగా మారింది. ఆ తర్వాత 2021లో దీనిని అధికారికంగా రాష్ట్ర గీతంగా గుర్తించారు.

**విజయ్ ప్రమాణస్వీకారం వేళ వివాదం**

అయితే, తమిళనాడు ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్ ప్రమాణస్వీకారం చేసినప్పుడు జాతీయ గేయం, జాతీయ గీతం చివరిగా తమిళ రాష్ట్ర గీతాన్ని ఆలపించడంతో వివాదాస్పదమైంది. ఇది జరిగిన కొద్ది రోజులకే ఒక యూనివర్సిటీ కార్యక్రమంలోనూ, అలాగే, విజయ్ పార్టీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు కూడా ఈ గీతాన్ని మూడో స్థానానికి నెట్టారు. గవర్నర్ కార్యాలయమే ఈ నిర్ణయం తీసుకుందని టీవీకే ఆరోపించింది.

ఇటీవల తమిళనాడుకు చెందిన 21 మంది ఎంపీలు గవర్నర్‌కు లేఖ రాస్తూ... కార్యక్రమాల ప్రారంభంలో ముందుగా రాష్ట్ర గీతాన్ని, ముగింపులో జాతీయ గీతాన్ని ఆలపించేలా ఆదేశించాలని కోరారు.

# విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యలపై చర్చకు సిద్ధం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10, అనంతజనశక్తి న్యూస్**



దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, వారిపై పోలీసు చర్యలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. విద్యార్థుల ఉద్యమానికి సంబంధించిన ప్రతి అంశంపైనా చర్చించేందుకు కేంద్రం సిద్ధమేనని ఆయన సోమవారం తెలిపారు. అయితే, సభా కార్యక్రమాలను అడ్డుకునేలా విపక్షాలు హంగామా చేయకూడదని స్పష్టం చేశారు. ‘విద్యార్థుల ఉద్యమం, దానికి సంబంధించిన పరిణామాలపై పూర్తి స్థాయి, సవివరమైన చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అయితే చర్చ జరుగుతున్నప్పుడు, హోంమంత్రి లేదా ప్రభుత్వం సమాధానం ఇస్తున్న సమయంలో విపక్షాలు సభలో అంతరాయం కలిగించకూడదు. హోంమంత్రి ఇచ్చే సమాధానాన్ని వారు వినాలి’ అని రిజిజు పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్స్, బిహార్‌లోని సివాన్‌లో ఏకే47 వినియోగంపై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలని విపక్షాలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

కాగా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ ఓ జాతీయ పత్రికలో రాసిన వ్యాసం నేపథ్యంలో కేంద్రం ఈ ప్రకటన చేయడం గమనార్హం. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై హోంమంత్రి అమిత్ షా ఇప్పటివరకు ఎలాంటి విచారణకు ఆదేశించలేదని, కనీసం ప్రకటన కూడా చేయలేదని ఆ వ్యాసంలో రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థులపై జరిగిన దాడిని హోంమంత్రి సమర్థిస్తున్నారనే విషయాన్ని ఆయన మౌనం స్పష్టం చేస్తోందని ఆరోపించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు విపక్షాలు ప్రతిరోజూ నోటీసులు ఇస్తున్నప్పటికీ వాటిని తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు.

విద్యార్థుల ఆందోళనలను అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలకు పాల్పడిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఢిల్లీలో విద్యార్థులపై టియర్ గ్యాస్, మేకులు అమర్చిన లాఠీలతో దాడి చేశారని, పెల్లెట్ గన్స్ ప్రయోగించారని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లోని సివాన్‌లో ఏకే47 వినియోగంపైనా ఎంపీ ప్రశ్నలు లేవనెత్తారు. నీట్ పరీక్షలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు ముందుకు రావడం లేదని మండిపడ్డారు. కాగా, కేంద్ర మంత్రి తాజా ప్రకటనతో పార్లమెంట్‌లో ఎలాంటి వాడీవేడి చర్చ జరగనుందోననే ఆసక్తి నెలకొంది.

# ఆలోచన చేయలేని ప్రభుత్వం

**- వారం వ్యవధిలో ముగ్గురు అమ్మాయిలు బలి**

**- నిమ్మకు నీరెత్తినట్లు ప్రభుత్వ, ప్రతిపక్షాలు**

**అమరావతి, ఆగస్ట్ 10, అనంతజనశక్తి న్యూస్**



ఆంధ్రప్రదేశ్‌లోని అధికార టీడీపీ కూటమి, విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రస్తావించిన విజయసాయిరెడ్డి.. ఆలోచన చేయలేని ప్రభుత్వం, చర్చ చేయలేని ప్రతిపక్షం.. ప్రజలకు వరమా? శాపమా? అంటూ సుదీర్ఘ ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన వారం రోజుల వ్యవధిలో ముగ్గురు ఆడపిల్లల ప్రాణాలు అమానుష రీతిలో బలైపోయాయని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రిలో మెడికో ప్రియాంక, చిలకలూరిపేటలో షేక్ హసీనా, విజయవాడకు చెందిన షేక్ ఆసిఫా ఉదంతాలను ట్వీట్‌లో ప్రస్తావించారు.

రాజమండ్రిలో ప్రియాంకను దారుణంగా నడిరోడ్డు మీద తొక్కించి చంపేస్తే.. కారణమైన వారిని ఉరితీయాలని ప్రియాంక తండ్రితప్ప, బడా నాయకులు ఎవరూ మాట్లాడటం లేదని విజయసాయిరెడ్డి విమర్శించారు. చంపేసిన వారికి వైసీపీలోని ఓ వర్గం నేతలు, టీడీపీలోని మరో వర్గం నాయకులు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. రెండు బలమైన పార్టీలు లాలూచీ అయితే, రాష్ట్రంలో ఏ మనిషి ప్రాణాలకైనా రక్షణ ఉంటుందా అని ప్రశ్నించిన విజయసాయిరెడ్డి.. ప్రియాంక కేసును సీబీఐకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

చిలకలూరిపేటలో షేక్ హసీనా అనే ఆడబిడ్డను దారుణంగా చంపి, శవాన్ని కూడా తగలబెట్టారన్న విజయసాయిరెడ్డి.. ఈ కేసులో అటు ప్రభుత్వం గానీ, ఇటు వైసీపీలో కానీ పెద్దగా చలనం లేదని విమర్శించారు. ఈ ఘటనను ఇద్దరు వ్యక్తుల ప్రైవేటు వ్యవహారంగా చూపి, హసీనా కేసును అటకెక్కించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. విజయవాడలో ట్రాఫిక్ డీసీపీ కుమార్తె, షేక్ ఆసిఫా రోడ్డు ప్రమాదంలో చనిపోయిందని అంటున్నారని.. రోడ్డు ప్రమాదానికి కారణాలేమిటి? ఓవర్ స్పీడింగ్ మాత్రమేనా అనే దానిపై నిజాలు చెప్పడం లేదని విమర్శించారు.

ఆడబిడ్డల ఉసురు తీయటంలో, అడ్డగోలుగా జరుగుతున్న ప్రమాదాల్లో లిక్కర్ ప్రభావం గురించి ప్రభుత్వం ఏనాడైనా ఆలోచించిందా అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. నేరాల పెరుగుదలకు, మనుషుల విపరీత ప్రవర్తనకు గంజాయి, డ్రగ్స్ కారణమని.. ఈరెండింటినీ నిరోధించకపోతే సమాజం ఏమవుతుందో అనే ఆందోళన అధికార, ప్రతిపక్షాలలో లేకుండా పోయిందని విజయసాయిరెడ్డి తప్పుబట్టారు. ప్రజల్ని బతికించే అంశాల మీద ఆలోచన చేయలేని ప్రభుత్వం, చర్చ చేయలేని ప్రతిపక్షం..ఈ రెండూ అయిదున్నర కోట్ల ప్రజలకు వరమా? శాపమా? అంటూ ట్వీట్ చేశారు.

# భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దు





(మొదటి పేజీ తరువాయి)

పవిత్రమైన శ్రీవారి గోవింద నామాలు, భక్తి గీతాలను పేరడీ చేసి పాడిస్తూ అపహాస్యం చేశారంటూ.. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తిరుమల కొండపై గోవిందా హరి గోవిందా అని వినిపించే.. గోవింద నామాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీ చేసి.. కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీశారంటూ వైసీపీ నేతలపై కూటమి నేతలు, పలువురు నెటిజన్లు మండిపడుతున్నారు.

ఈ నేపథ్యంలో తిరుమల శ్రీవారి గోవింద నామాలను పేరడీ చేసిన అంశంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. దైవాన్ని కొలిచే మంత్రాలు, నామాలను అపహాస్యం చేయడం ఆపాలని స్పష్టం చేశారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని భక్తితో కొలుస్తూ ఆలపించే పవిత్ర దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ అవసరాల కోసం పేరడీలుగా పాడుతూ అపహాస్యం చేయడాన్ని పవన్ కళ్యాణ్ ఖండించారు.

నెల్లూరు నగరంలో ప్రతిపక్ష హోదా కూడా లేని పార్టీ.. తన రాజకీయాలకు పవిత్ర గోవింద నామాలను పేరడీ చేస్తూ భక్తుల మనోభావాలను కించపరచిన తీరు, ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారి వైనం ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. మతపరమైన విద్వేషాలు రేపే కుట్రపూరిత ఆలోచనలతో ఈ రకంగా చేశారన్న పవన్ కళ్యాణ్.. ఈ చర్యలపై చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని జనసేన పార్టీ నాయకులకు సూచించారు. ధార్మిక విశ్వాసంలో భాగమైన దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలు, కీర్తనలను అపహాస్యం కోసం వాడే విధానాన్ని అందరూ విడిచిపెట్టాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు ఏపీ ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతోంది. అందులో భాగంగానే నెల్లూరులోని వీఆర్సీ సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.

# ఇంటింటా జాతీయ జెండాను ఎగరేయండి: మోదీ

మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం మనకు నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం నాడు కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని 2022 నుంచి ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారీ జాతీయ జెండాను ఎగురవేసి.. వికసిత భారత్‌కు మన ఉమ్మడి కట్టుబాటును చాటుదామని మోదీ కోరారు. క్విట్ ఇండియా ఉద్యమకర్తలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారు కనబరిచిన ధైర్యసాహసాలు భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ కొనియాడారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో మొదలైన ఉద్యమం మన దేశ స్వాతంత్ర్య పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణను ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు.

వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోం: కేరళ

కాసర్‌గోడ్: తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్, కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నిథాన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే గీతంలోని మొదటి రెండు చరణాలనే పాడతామని తెలిపారు.



# భద్రంగా ఉంటాయని రూ.5 లక్షలు భూమిలో దాచిపెడితే..!



దొంగల బారిన పడకుండా భద్రంగా ఉంటాయని భావించి ఓ రైతు రూ.5 లక్షలను భూమిలో పాతిపెట్టారు. అయితే ఆ ప్రదేశాన్ని మర్చిపోవడంతో ఏడాది పాటు అవి దొరకలేదు. చివరికి ఆ డబ్బు దొరికినప్పటికీ అప్పటికే చెదపురుగులు తినేశాయి. దీంతో ఆ రైతు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. రాజస్థాన్ లో ఈ ఘటన చోటుచేసుకుంది.

స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. నెవాయి గ్రామానికి చెందిన రైతు మంగిలాల్ ఏడాది క్రితం తన భూమిలో కొంతభాగాన్ని రూ.5 లక్షలకు విక్రయించారు. ఈ విషయం ఎవరికీ చెప్పకుండా.. వచ్చిన సొమ్మును జాగ్రత్తగా ఉంచాలని భావించి ఓ సంచిలో మూటకట్టి వ్యవసాయ భూమిలో పాతిపెట్టారు. కొన్ని నెలల తర్వాత ఆ డబ్బు దాచిపెట్టిన స్థలం మర్చిపోవడంతో ఆందోళనకు గురయ్యారు. అదే విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పారు. దీంతో దాదాపు ఆరు ఎకరాలు ఉన్న పొలంలో పలుచోట్ల తవ్వి చూసినా.. డబ్బు దొరకలేదు. ఇటీవల విత్తనాలు వేయడానికి పొలం దున్నుతున్న సమయంలో డబ్బు సంచి బయటపడడంతో మంగిలాల్ కుటుంబసభ్యులు ఆశ్చర్యపోయారు. కానీ, తీరా సంచి తెరిచి చూడగా అందులోని నోట్లను చెదపురుగులు తినేశాయి. వాటిలో స్వల్పంగా దెబ్బ తిన్న నోట్లను తీసుకొని ఆ కుటుంబం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) శాఖను సంప్రదించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే నోట్ల పరిస్థితి చూసి వాటిని తీసుకునేందుకు బ్యాంకు అధికారులు నిరాకరించడంతో వారు నిరాశతో వెనుదిరిగారు.



# నా అల్లుడు 25 పెళ్లిళ్లు చేసుకున్న మోసగాడు – ఓ ఎమ్మెల్యే ఆరోపణ

తన కుమార్తె వివాహ బంధానికి సంబంధించి ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ భాజపా ఎమ్మెల్యే తీవ్ర ఆరోపణలు చేశారు. అనేక మంది మహిళలను మోసం చేసిన వ్యక్తితో తన కుమార్తెకు వివాహం జరిగిందని అన్నారు. నకిలీ గుర్తింపు కార్డులతో అనేక పెళ్లిళ్లు చేసుకొని డబ్బులు దండుకున్నట్లు తెలిసిందని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

యూపీలోని సేవతా నియోజకవర్గ ఎమ్మెల్యే జ్ఞాన్ తివారీ కుమార్తె ప్రజ్ఞాకు సీతాపూర్ జిల్లాకు చెందిన అనూజ్ త్రివేది కుమారుడు ప్రఖార్ త్రివేదితో 2024లో వివాహం జరిగింది. ముంబయిలో పేరొందిన రియల్ ఎస్టేట్ వ్యాపారిగా అనూజ్ పరిచయం చేసుకోవడం, ఆ కుటుంబానికి స్థానికంగా మంచి పేరుందని తెలియడంతో జ్ఞాన్ తివారీ ఈ సంబంధానికి అప్పట్లో ఓకే చెప్పారు.

కానీ, ఇటీవల అల్లుడి కార్యకలాపాలు, మోసాలకు సంబంధించిన కేసులు వెలుగులోకి రావడంతో అతడి చరిత్రపై ఎమ్మెల్యే ఆరా తీశారు. తప్పుడు ఐడీ కార్డులతో మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో అనేక మంది మహిళలను ప్రలోభపెట్టి కోట్లాది రూపాయలు కాజేసినట్లు తెలుసుకున్నారు. అంతేకాదు.. ఇప్పటికే తన అల్లుడు దాదాపు 25 పెళ్లిళ్లు చేసుకున్నాడని తెలియడంతో కంగుతిన్నారు. ఈ విషయాలు తెలిసిన వెంటనే నిందితుడి కుటుంబంతో సంబంధాలు తెంచుకొని తన కుమార్తెను తమ ఇంటికి తీసుకువచ్చామని వెల్లడించారు. ప్రఖార్ నేర చరిత్ర, కేసుల వివరాలను దాచిపెట్టి వివాహం జరిపించారని, దీంతో తన కుటుంబం తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తోందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఓ ప్రజాప్రతినిధిగా తన పరువుకూ నష్టం కలిగిందన్నారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదుతో చీటింగ్ కేసు నమోదు చేసిన యూపీ పోలీసులు..తండ్రీకొడుకులను అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఇదిలాఉంటే, ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో మహారాష్ట్రలోనూ వారిపై కేసు నమోదైనట్లు తెలిసింది.

# రోజుల తరబడి నీటిలోనే.. 16 ఏళ్ల బాలుడి వింత ప్రవర్తన



సాధారణంగా మనిషి నీటిలో కొన్ని నిమిషాలు ఉంటేనే ఇబ్బంది పడతాడు. కానీ ఈ బాలుడు వారంలో ఏకంగా నాలుగైదు రోజులు నీటిలోనే గడుపుతున్నాడు. ఒక్కోసారి ఏడు రోజులపాటు రాత్రిపగలూ చెరువులో ఉంటున్నాడు. అతడి వింత ప్రవర్తన స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వివరాల్లోకి వెళితే..

పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా బెల్దాంగాకు చెందిన 16 ఏళ్ల ఇక్బాల్ షేక్ గత ఐదేళ్లుగా ఇలా చెరువుల్లోనే గడుపుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. శరీరంలో మంటగా అనిపించడం వల్లే నీటిలో ఉంటున్నానని ఇక్బాల్ చెబుతున్నాడు. బయటకు రాగానే మంట మొదలవుతుందని.. నీటిలోకి వెళ్లగానే ఉపశమనం కలుగుతుందని అంటున్నాడు. రోజుల తరబడి నీటిలో ఉండటంతో అతడు చర్మవ్యాధుల బారిన పడుతున్నాడు. ఇక, జలుబు, దగ్గు వెంటాడుతున్నాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకున్నా.. ఫలితం లేకపోయింది. ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లే స్తోమత తమకు లేదని ఇక్బాల్ కుటుంబసభ్యులు చెబుతున్నారు. దీంతో అతడికి చికిత్స చేయించేందుకు స్థానికులు ముందుకొస్తున్నారు.

# ఒంటి చక్రం.. ఒకటే నినాదం

ఈ చిత్రం చూడగానే ముందు చక్రం ఊడిపోయిన సైకిల్‌ను ఓ యువకుడు తొక్కుతున్నట్లు అన్పిస్తోంది కదూ! కానీ ఆ యువకుడే దాన్ని తీసేసి ఒంటి చక్రంతో ఇలా వందల కి.మీ. తొక్కుకుంటూ వెళ్తున్నారని తెలిశాక ఓహో అనాల్సిందే. కేరళలోని కన్నూర్‌కు చెందిన సనిత్.. వృత్తిరీత్యా ఇంజినీర్. మత్తుపదార్థాల వినియోగంతో కలిగే దుష్ఫలితాల పట్ల ప్రజల్లో వినూత్నంగా అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. అందుకు ఒంటి చక్రం ఉన్న సైకిల్‌పై యాత్రకు ఉపక్రమించారు. మే 25న కన్నూర్ నుంచి బయల్దేరారు. పళని, మదురై, రామనాథపురం, పాంబన్ రోడ్డు వంతెన మీదుగా రామేశ్వరం చేరుకున్నారు. అనంతరం ధనుష్కోటికి వెళ్లి మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలపై పర్యాటకులకు అవగాహన కల్పించారు. అక్కడి నుంచి పుదుచ్చేరి, చెన్నై మీదుగా నేపాల్ వెళ్లనున్నట్లు తెలిపారు. రోజుకు 3040 కి.మీ. దూరం ప్రయాణిస్తున్నట్లు చెప్పారు.



కాటేసిన పామును మెడకు చుట్టుకుని ఆసుపత్రికి

ఛత్తీస్‌గఢ్‌లో ఓ యువకుడు తనను కాటేసిన పామును మెడకు చుట్టుకుని బైక్‌పై 14 కిలోమీటర్లు ప్రయాణించి ఆసుపత్రికి చేరుకున్నాడు. కాంకేర్ జిల్లా పఖాంజూర్ గ్రామానికి చెందిన దేవ్‌జిత్ సర్కార్ గత ఎనిమిదేళ్లుగా స్నేక్ క్యాచర్‌గా పని చేస్తున్నాడు. నివాస ప్రాంతాల్లోకి వచ్చిన పాములను పట్టుకుని సురక్షిత ప్రదేశాల్లో విడిచిపెడుతుంటాడు. ఈ క్రమంలో ఓ పామును పట్టుకునేందుకు ప్రయత్నిస్తుండగా అది కాటేసింది. ఆ పాము విషపూరితమా కాదా అనేది తెలుసుకునేందుకు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పామును పరిశీలించిన వైద్యులు అది విషపూరితం కాదని గుర్తించారు. పామును మెడకు చుట్టుకుని ఆసుపత్రికి రావడం సరికాదని, అది విషపూరితమైతే పరిస్థితి భిన్నంగా ఉండేదని డాక్టర్ సంజీత్ వైష్ణవ్ తెలిపారు. దేవ్‌జిత్‌కు చికిత్స చేశామని, త్వరగా కోలుకున్నట్లు వెల్లడించారు.

# పంద్రాగస్టుకు 'బస్తర్' కళ

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తరపున ఈ ఏడాది అతిథులకు పంపే ఆహ్వాన కిట్లకు ఓ ప్రత్యేకత ఉంది. దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా 130 మంది కళాకారుల బృందం వీటిని రూపొందించగా.. ఇందులో నిన్నమొన్నటిదాకా నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంత కళాకారులు దాదాపు 50 మంది ఉన్నారు. 'ఇండిపెండెన్స్ డే ఎట్ హోం' పేరుతో సిద్ధమైన ఈ కిట్లు ఛత్తీస్‌గఢ్, గోవా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల హస్తకళలు, సాంస్కృతిక వారసత్వాలకు అద్దం పట్టేలా రూపుదిద్దుకున్నాయి. రాష్ట్రపతి భవన్ అధికారులు, అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్‌ఐడీ) బృందం పర్యవేక్షణలో ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా రూపకల్పన చేశారు. పర్యావరణ హిత హస్తకళా పద్ధతులు, సంప్రదాయాల మేళవింపుతో ఈ కిట్ల తయారీకి కళాకారులు, తమ బృందాలు 3 నెలలకు పైగా శ్రమించినట్లు ఎన్‌ఐడీ డైరెక్టర్ అశోక్ మండల్ తెలిపారు.




# ఫ్లైఓవర్‌పై మినీ బస్సు బోల్తా.. 29 మంది విద్యార్థినులకు గాయాలు



జమ్మూలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక శకుంతల ఫ్లైఓవర్‌పై విద్యార్థులతో వెళ్తున్న మినీబస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 29 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు జమ్మూ ప్రభుత్వ వైద్య కళాశాల అధికారులు తెలిపారు. కొందరికి ఎముకలు విరిగినట్లు చెప్పారు.

తిరంగా ర్యాలీలో పాల్గొనేందుకు విద్యార్థులు బాగ్‌ఎబహు ప్రాంతానికి వెళ్లారు. అక్కడి నుంచి ముబారక్ మండీకి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ విద్యార్థినులంతా డిఫెన్స్ సర్వీసెస్, పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్నారు. గాయపడిన వారిలో జమ్మూలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు ఉన్నారు. 29 మంది ఆసుపత్రిలో చేరగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# కన్నవారి సేవే తీర్థం.. కొలిచిన జన్మే ధన్యం



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాగ్‌పత్ జిల్లాకు చెందిన సంజీవ్ కుమార్, అనిల్ కుమార్ అనే సోదరులు వయోవృద్ధులైన అమ్మానాన్నలను కావడిలో మోస్తూ హరిద్వార్ నుంచి దాదాపు 200 కిలోమీటర్లు నడిచారు. కావడి యాత్రలో భాగంగా హరిద్వార్‌లో గంగాజలాలను సేకరించి.. తిరుగు ప్రయాణంలో తల్లిదండ్రులను ఇలా కావడిలో మోస్తూ తీసుకెళ్తున్న వీరిని చూసిన సహ యాత్రికులు 'కలియుగ శ్రవణకుమారులు'గా ప్రశంసించారు. 'ఆ శివుణ్ని మేము ప్రత్యేకంగా వరమేదీ కోరుకోలేదు. అమ్మానాన్నల సేవే మాకు అత్యున్నత తీర్థయాత్ర' అని సంజీవ్, అనిల్ తెలిపారు.

# కావడి యాత్ర కొత్తగా..

ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన అన్నాచెల్లెళ్లు యుగ్ (12), నందిని (10) స్కేటింగ్ చేస్తూ హరిద్వార్ నుంచి గాజియాబాద్‌కు కావడి యాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది జనవరిలో తమ స్వస్థలమైన గాజియాబాద్ నుంచి అయోధ్యకు సుమారు 650 కిలోమీటర్ల దూరం స్కేటింగ్ చేసి రికార్డు సృష్టించిన వీరిద్దరూ ఇప్పుడు మరో యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ యాత్రలో హరిద్వార్‌లోని 'హర్ కీ పౌఢీ' నుంచి గాజియాబాద్‌కు గంగాజలాలను తీసుకెళ్తున్నారు. దాదాపు 200 కిలోమీటర్ల ఈ యాత్ర రూర్కీ, ముజఫర్‌నగర్, మేరఠ్ మీదుగా ఈ నెల 11 నాటికి గాజియాబాద్‌కు చేరుకుంటుంది. హరిద్వార్ నుంచి తీసుకెళ్తున్న గంగా జలాలతో శివుడికి అభిషేకం చేయడంద్వారా వీరి యాత్ర పూర్తవుతుంది.



# అమిత్ షా సమాధానం చెప్పాల్సిందే: రాహుల్

ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'నేరం'పై ఆయన సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమంలో ఓ విద్యార్థి నీట్‌కు సన్నద్ధమైన తాను సర్వం కోల్పోయానని, తనకు ఏ అవకాశాలు మిగల్లేదని ఆవేదనతో తెలిపాడని రాహుల్ వెల్లడించారు. దిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద విద్యార్థుల ఆందోళన ముగిసి చాలా రోజులవుతునప్పటికీ ఇప్పటి వరకూ వారిపై పోలీసుల దాడికి సంబంధించి అమిత్ షా నోటి నుంచి ఒక్క మాట కూడా పెగల్లేదని రాహుల్ విమర్శించారు. మరోవైపు విద్యార్థులకు క్షమాపణ చెప్పడానికి బదులు వారిని క్షమిస్తున్నానంటూ ప్రధాని మోదీ తీరిక లేకుండా ఉన్నారని ఆక్షేపించారు.



# విద్యార్థుల నిరసనలపై చర్చకు సిద్ధమే..

## - అమిత్ షా మాట్లాడతారు: కేంద్రం



నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై ఉద్యమించిన విద్యార్థులపై పోలీసుల అనుచిత తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా (Amit shah) వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంపై పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కీలక ప్రకటన చేశారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యలపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దీనిపై సమాధానం ఇస్తారని ప్రకటించారు.

"విద్యార్థుల నిరసనలపై సమగ్ర చర్చతోపాటు ప్రతిపక్షాలు లేవనెత్తిన అన్ని అంశాలపై సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేంద్ర హోంమంత్రి దీనిపై స్పందిస్తారు. అయితే.. చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్షాలు ఎటువంటి అంతరాయం కలిగించవద్దు. హోం మంత్రి ప్రకటనకు ఆటంకం కలిగించేలా గందరగోళం సృష్టించకూడదు. హోంమంత్రి ఇచ్చే సమాధానాన్ని వినాలి. చర్చ సమగ్రంగా సాగేలా సహకరించాలి. ఈ మేరకు ప్రతిపక్షాలు హామీ ఇవ్వాలి" అని కిరణ్ రిజిజు మీడియాతో అన్నారు. జులై 20న ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు పదేపదే వాయిదా పడుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు తొలుత నీట్ పేపర్ లీక్‌పై, అయోధ్య రామ మందిరంలో విరాళాల అవకతవకలపై నిరసన తెలిపాయి. ఆ తర్వాత.. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై చర్చకు పట్టుబడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి సభకు హాజరు కావాలని, ఈ అంశాలపై ప్రకటనలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.



# ఉద్యమ కెరటాలు నిలిచేనా?

మాతృదేశంలో జన చైతన్య ఉరుములు మెరుపులకు సంబంధిత ప్రవాసులు స్పందించడం సహజం. ప్రవాస భారతీయ యువత అలనాటి స్వాతంత్ర్యోద్యమం నుంచి నేటి జంతర్ మంతర్ పోరాటం దాకా ప్రతి ప్రజాప్రతిఘటనకు ప్రభావశీలంగా ప్రతిస్పందిస్తూనే ఉన్నది. మాతృదేశంలో యువత చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా విదేశాలలోని యువత నుంచి లభించిన స్పందన ఆశ్చర్యం కలిగించింది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ప్రజ్వరిల్లిన విద్యార్థి ఉద్యమానికి మద్దతుగా అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియాలోని ప్రధాన నగరాలలో నిర్వహించిన ప్రదర్శనలలో ప్రవాస యువ భారతీయులు అంచనాలకు మించి పాల్గొన్నారు. పాలనా వ్యవస్థల్లో అవినీతి నిర్మూలనకై 2011లో అన్నా హజారే నిర్వహించిన ఉద్యమ సందర్భంలో కంటే ఎక్కువగా జంతర్ మంతర్ విద్యార్థుల పోరుకు ప్రవాస భారతీయ యువత స్పందించింది.

అయితే గల్ఫ్ దేశాలలోని ప్రవాస భారతీయ సమాజం మాత్రం 'బొద్దింకల పోరు'పై ఆచితూచి స్పందించింది. ఈ దేశాలలో సీబీఎస్ఈ అనుబంధ భారతీయ పాఠశాలలు 170 దాకా ఉన్నాయి. ఈ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులలో, స్వదేశంలో వైద్య విద్యాభ్యాసానికి తాపత్రయ పడే వారి సంఖ్య తక్కువేమీ కాదు. 'నీట్' పరీక్షా కేంద్రాలు సైతం ఈ దేశాలలో ఉన్నాయి. 'నీట్' ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలు లీక్ కావడం, తరువాత ఆ పరీక్ష రద్దు కావడం, పిమ్మట ఇరాన్ యుద్ధం మూలంగా సీబీఎస్ఈ సంవత్సరాంత పరీక్షలూ రద్దయ్యాయి. ఈ పరిణామాలతో గల్ఫ్ దేశాలలోని సీబీఎస్ఈ పాఠశాలల భారతీయ విద్యార్థులు నష్టపోయారు. అమెరికా, ఐరోపా, ఇతర పాశ్చాత్య దేశాలలోని భారతీయ విద్యార్థులు ఆయా దేశాల విద్యావిధానంలో విద్యనభ్యసిస్తారు. భారతీయ విద్యా విధానాలతో వారికి సంబంధముండదు. వివిధ పాశ్చాత్య దేశాలలోని ప్రవాస భారతీయులు ఉత్సాహంగా ముందుకు వచ్చి సీజేపీ పోరాటానికి బాసటగా నిలిచారు. అయితే గల్ఫ్‌లోని ప్రభావిత విద్యార్థులు కనీసం సామాజిక మాధ్యమాలలో కూడా తమ అసంతృప్తిని వ్యక్తీకరించలేదు!

వర్తమాన భారత రాజకీయాలలో ఒక వినూత్న సంచలనాన్ని సృష్టించిన అభిజిత్ దీప్కే (సీజేపీని ప్రారంభించిన జెన్–జీ పోరాటకారుడు) భారతీయ యువత మానసిక అలజడిని సరిగ్గా అర్థం చేసుకున్నాడు. వారిలో పోరాట జ్వాల రగిలించాడు. అధికారాన్ని ప్రశ్నించే యువశక్తికి ప్రతీకగా ప్రభవించాడు. ప్రశ్నపత్రాల లీకులకు వ్యతిరేకంగా జరిగిన సీజేపీ ఉద్యమం యువతలో గూడుకట్టుకున్న అసంతృప్తి, ఆగ్రహాన్ని సంపూర్ణంగా వ్యక్తం చేసేందుకు ఒక వేదిక అయింది. స్వదేశంలో అవకాశాలు లేకనే యువత విదేశీబాట పడుతోందనే విషయాన్ని నిజాయితీగా అంగీకరించాలి.

ఆక్రోశం, ఆవేదన ఎంతగా ఉన్నా వాటిని వ్యక్తీకరించేందుకు అవసరమైన ధైర్యసాహసాలు అందరికీ ఉండవు. విదేశాలలో ఉన్నా, స్వదేశంలో ఉన్నా వర్తమాన సామాజిక అంశాల పట్ల స్పందించడం అనేది వ్యక్తుల చైతన్యశీలతపై ఆధారపడి ఉంటుంది. ప్రత్యేకించి వృత్తిపరంగా మెరుగైన అవకాశాలు, వ్యక్తిగత ఆర్థిక సమున్నతికి విదేశాలకు వచ్చే భారతీయులలో మాతృభూమిలోని సామాజిక ఉద్యమాలు, పోరాటాల పట్ల సహానుభూతి చూపేవారు ఎంతోమంది ఉండరు.

అభిజిత్ దీప్కే వలే బోస్టన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన రాజన్ కిలెచంద్ దుబాయిలోని ప్రముఖ భారతీయ పారిశ్రామికవేత్తలలో ఒకరు. ఆ విశ్వవిద్యాలయానికి 25 మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చిన వితరణశీలి. అయితే స్వదేశంలోని సామాజిక ఉద్యమాలపై ఆయన అంతగా ఆసక్తి చూపరు. సంపన్న ప్రవాస భారతీయులలోని అత్యధికులకు రాజన్ ఒక ప్రతీక.

మొత్తం మీద స్వల్ప సంఖ్యలో ఉండవచ్చుగానీ విదేశాలలోని భారతీయ యువత మాతృభూమిలో సంభవిస్తున్న సంఘటనల పట్ల చురుగ్గా ప్రతిస్పందిస్తుందని చెప్పవచ్చు. ఈజిప్టు నుంచి బంగ్లాదేశ్ దాకా ఆగ్రహంతో గళమెత్తి ప్రభుత్వాలను కూల్చివేసిన యువత, కొత్త పాలకుల విధానాలను ప్రభావితం చేయడంలో విఫలమయిందనేది ఒక చేదు సత్యం. దశాబ్దం క్రితం ఇదే ఢిల్లీలో దుమారంతో పాటు ఒక ఆశను రేకెత్తించిన విద్యార్థి నాయకుడు కన్నయ్య కుమార్ ఉద్యమం తదనంతర కర్తవ్య సాధనలో ఎంతవరకు సఫలీకృతమయిందనేది కూడా గుర్తు చేసుకోవాలి. రాజకీయ క్రీడల్లో భాగం కాకుండా భావితరాలకు మేలు జరిగేలా నిర్మాణాత్మకంగా అడుగులు ముందుకు వేయవలసిన బాధ్యత ఉద్యమిస్తున్న భారతీయ యువతపై ఉన్నది.






# స్వయంప్రతిపత్తి దిశగా ట్రిబ్యునళ్లు

**మన ప్రజా చట్టంలో ట్రిబ్యునళ్ల ఏర్పాటు గురించి చర్చించినన్ని సార్లు బహుశా ఏ ఇతర అంశాల గురించి కూడా అంతగా పునఃపరిశీలన జరిగి ఉండదు. 1987 నాటి ఎస్.పి. సంపత్ కుమార్ కేసు నుంచి 2025 నవంబర్‌లో మద్రాస్ బార్ అసోసియేషన్ వరుస తీర్పుల వరకు, న్యాయస్థానాలు అనేక శాసనాలను కొట్టివేశాయి, ఆదేశాలు జారీ చేశాయి. ఆ తర్వాత అదే ప్రాతిపదికపై మళ్లీ కొత్త చట్టాలను పరిశీలించాల్సి వచ్చింది. ఈ విషయం ఇన్నిసార్లు పునరావృతం కావడం బట్టి ఈ సమస్య ఎంత క్లిష్టమైనదో అర్థం చేసుకోవచ్చు. 2026 నాటి ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ బిల్లు ప్రత్యేకమైన దృష్టిని ఆకర్షిస్తోంది; ఎందుకంటే ఇది ఎట్టకేలకు అసలు సమస్యను గుర్తించినట్లుగా కనిపిస్తోంది, ఆశించిన విధంగా దానికి ఒక పరిష్కారాన్ని కూడా కనుగొన్నట్లుంది.**




ఇతర ప్రాంతాల నుంచి, మన స్వంత అనుభవం నుంచి నేర్చుకున్న పాఠం

ఈ సమస్య కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితమైనది కాదు; ఇతర దేశాలు కూడా దీనిని ఎదుర్కొన్నాయి మరియు వాటి పరిశీలనలు ఎంతో గమనించదగినవి. "2001లో యునైటెడ్ కింగ్‌డమ్‌లో సర్ ఆండ్రూ లెగ్గాట్ ఈ రంగాన్ని సమీక్షించినప్పుడు, ఏడు వందలకు పైగా ట్రిబ్యునళ్లు ఏ శాఖల నిర్ణయాలనైతే తాము విచారించాల్సి ఉంటుందో, ఆ శాఖల పరిధిలోనే నిర్వహించబడుతున్నట్లు ఆయన గుర్తించారు. దీనినే ఆయన వ్యవస్థలోని ప్రధాన లోపంగా అభివర్ణించారు. పదవీకాలాన్ని సర్దుబాటు చేయడం లేదా అర్హతలను మెరుగుపరచడం పరిష్కారంగా సూచించలేదు. ట్రిబ్యునళ్లను వాటికి బాధ్యత వహించే శాఖల నుండి పూర్తిగా వేరు చేసి, వాటి పరిపాలనను ఒకే సర్వీసు కిందకు తీసుకురావడమే మార్గంగా చూపారు. అదే 2007 నాటి చట్టంగా రూపుదిద్దుకుంది. ఈ సంస్కరణ నిర్మాణాత్మకమైనది కావడం విశేషం; ఇది సమస్య తాలూకు లక్షణాలపై కాకుండా, ఆశ్రితత్వానికి గల మూల కారణాలపై దృష్టి సారించింది.

భారతదేశం ట్రిబ్యునళ్ల వ్యవస్థను చాలా ముందే స్వీకరించింది, మొత్తమ్మీద ఇందులో విజయవంతమైంది. 1941లో ఏర్పాటైన ఆదాయపు పన్ను అప్పీలేట్ ట్రిబ్యునల్, ప్రత్యేక విచారణకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ఉదాహరణలలో ఒకటిగా నిలిచింది. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 323A, 323B మరియు 1985 నాటి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ చట్టం ద్వారా ఈ నమూనాను మరింత ముందుకు తీసుకెళ్లారు. హైకోర్టులు మోయలేని స్థాయిలో వివిధ రెగ్యులేటరీ రంగాలలో దీనిని విస్తరించారు. అయితే, మన దేశం ఎదుర్కొన్న సమస్య భిన్నమైనది. 2020లో న్యాయస్థానం పేర్కొన్నట్లుగా, ట్రిబ్యునళ్లు కార్యనిర్వాహక వ్యవస్థ (ఎగ్జిక్యూటివ్)పై ఆధారపడాల్సిన అవసరం లేనప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాధ్యమవుతుంది.

**పూర్వపు ప్రయత్నాలు ఈ విషయాన్ని ఎందుకు కొలిక్కి తీసుకురాలేకపోయాయి**

సంస్కరణ కోసం అనేకసార్లు ప్రయత్నారు. ప్రతిసారీ సదుద్దేశంతోనే ప్రయత్నించారు. ఆ తర్వాత జరిగిన దాదాపు అన్ని వ్యాజ్యాలు పదవీకాలం మూడేళ్లా, నాలుగేళ్లా లేదా ఐదేళ్లా అనే దాని గురించే; అలాగే యాభై ఏళ్ల కనీస వయస్సు అనుమతించదగినదా? కాదా?, ఒక పేరును సిఫార్సు చేయాలా లేక ఇద్దరి పేర్లతో కూడిన ప్యానెల్‌ను సిఫార్సు చేయాలా అనే విషయాల చుట్టూనే తిరిగాయి. వీటిలో ఏదీ మూల సమస్యను తాకలేదు. స్వాతంత్ర్యం అనేది అంకగణితంపై ఆధారపడి ఉండదు. పదవీకాలం, వయస్సు, పేర్ల సంఖ్య అనేవి కేవలం వ్యాధిని నిర్ధారించే లక్షణాలు మాత్రమే. అవి వ్యాధి కాదు.

**అసలు సమస్య మూలం**

ఈ విషయంలో అసలు మూలం ఏమిటంటే, ఒక ట్రిబ్యునల్ అనేది స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థగా ఉండాలి. దానికి స్వంత యంత్రాంగం ఉండాలి, దానిని నడిపించే వారిని ఎన్నుకోవడానికి స్వంత మార్గాలు ఉండాలి, వారిని పర్యవేక్షించడానికి, క్రమశిక్షణలో ఉంచడానికి స్వంత యంత్రాంగం ఉండాలి, అలాగే భవనాలు, సిబ్బంది, నిధుల కోసం స్వంత ఏర్పాట్లు ఉండాలి. ఇవన్నీ ఉన్నచోట, స్వాతంత్ర్యం సహజంగానే సాధ్యమవుతుంది. కోర్టు మాట్లాడిన అంశాలపై కొత్త బిల్లు తగిన సమాధానాలు ఇస్తోంది. అంతేకాకుండా ఇది మరో అడుగు ముందుకు వేసింది. ఆ సమాధానాలను స్వయంగా అమలు చేసుకునేలా ఒక సంస్థను నిర్మించడానికి ప్రయత్నిస్తుంది. శాసనానుసారంగా ఒక జాతీయ ట్రిబ్యునల్స్ కమిషన్ ఏర్పాటు చేయబడుతుంది. ఇది ఏ విధమైన కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా కాకుండా, చట్టం ద్వారానే తన ఉనికిని, కూర్పును, విధులను పొందుతుంది; అంతేకాకుండా ఇది ఎంపిక, పర్యవేక్షణ, క్రమశిక్షణ, ట్రిబ్యునళ్లకు అవసరమైన వాటి అంచనా వేసే బాధ్యతను కలిగి ఉంటుంది. దీని చుట్టూ ఒక శాశ్వత వృత్తిపరమైన సెక్రటేరియట్ ఉంటుంది.

**ప్రాధాన్యత, సమాన దూరం మరియు దానిని పనిచేసేలా చేసే చెక్స్ అండ్ బ్యాలెన్స్**

ఈ బిల్లు అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రతి దశలోనూ న్యాయపరమైన అత్యున్నత స్థానాన్ని (జ్యుడీషియల్ ప్రీఎమినెన్స్) కాపాడుతుంది. ఈ కమిషన్‌కు సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి లేదా హైకోర్టు ప్రధాన న్యాయాధికారి అధ్యక్షత వహిస్తారు, ఇందులో న్యాయపరమైన మెజారిటీ ఉంటుంది. కమిటీలకు న్యాయమూర్తులే అధ్యక్షత వహిస్తారు, న్యాయపరమైన అధ్యక్ష స్థానంలోనే నిర్ణయాత్మక ఓటు ఉంటుంది. ఎంపిక, పర్యవేక్షణ, క్రమశిక్షణ, పనితీరు అన్నీ కూడా న్యాయపరమైన వర్గం ఆధ్వర్యంలోనే నడుస్తాయి. 'ఆర్. గాంధీ' కేసు నుండి కోర్టు చెబుతున్నదానికి ఇది అనుగుణంగా ఉంది; ఎందుకంటే కార్యనిర్వాహక వ్యవస్థ (ఎగ్జిక్యూటివ్) అత్యధికంగా వ్యాజ్యాలు దాఖలు చేసే పార్టీ కాబట్టి, తనకు వ్యతిరేకంగా తీర్పునిచ్చే వారిని ఎన్నుకోవడంలో అది ఆధిపత్యం చెలాయించకూడదు.

సమాన ప్రాధాన్యత అంటే నియంత్రణ కాదని గ్రహించడం కూడా అంతే ముఖ్యం. వ్యవస్థ పూర్తిగా న్యాయ వ్యవస్థ చేతికి అప్పగిస్తే, అది కూడా సవాళ్లను ఎదుర్కొంటుంది. అందువల్ల ఈ బిల్లు ట్రిబ్యునల్‌ను కార్యనిర్వాహక వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు సమాన దూరంలో ఉంచుతుంది, ఇది మూడు అంచెల ద్వారా జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం నిబంధనలలో విస్తృత సూత్రాలను నిర్దేశిస్తుంది. కమిషన్ పనులు ఎలా జరగాలో నియమాలను రూపొందిస్తుంది. సచివాలయం ఆ ఫ్రేమ్‌వర్క్ లోపల అమలవుతుంది. ఇది తన పనితీరు విధానంలో మార్గదర్శకత్వం పొందుతుంది కానీ కార్యాచరణ స్థాయిలో ఆదేశించదు. ఇది ప్రతినిధి బృందం ద్వారా కాకుండా చట్టం నుంచే తన విధులను పొందుతుంది.

దీని ఫలితంగా కమిషన్, సచివాలయం, ఎగ్జిక్యూటివ్‌ల కలయిక ద్వారా నిజమైన అధికార సమతుల్యత వ్యవస్థ ఏర్పడుతుంది. సచివాలయం అర్హతలను పరిశీలిస్తుంది, ప్రతి నిర్ణయం తీసుకోబడే రికార్డును సంకలనం చేస్తుంది. ఇది ప్రచురించబడిన నిబంధనలకు బద్ధమై ఉంటుంది, తాను చేసిన పనుల రికార్డును ఉంచుతుంది. ఈ బిల్లు సాధించిన సున్నితమైన సమతుల్యత ఇదే. ఇక్కడ పరిపాలనలో న్యాయపరమైన జోక్యం ఉండదు లేదా వాస్తవంలో ఎగ్జిక్యూటివ్‌పై ఆధారపడటం జరగదు, అదే సమయంలో ఎంపిక, పర్యవేక్షణ, క్రమశిక్షణ, పనితీరులో న్యాయపరమైన ప్రాధాన్యత ఉంటుంది. కెనడా కూడా 2014లో ఇలాంటి అభిప్రాయానికే వచ్చింది, అప్పుడు అది తన ఫెడరల్ ట్రిబ్యునళ్ల సపోర్ట్ సర్వీసులను ఒకే సంస్థలోకి తీసుకువచ్చింది, అదే సమయంలో వాటి న్యాయపరమైన స్వాతంత్ర్యాన్ని కాపాడింది.

ఇటువంటి చట్టాలను కేవలం న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొని నిలబడుతాయా లేదా అనే కోణంలో మాత్రమే చూడకూడదు; ఆ సవాళ్లకు మూల కారణమైన పరిస్థితులను ఈ చట్టం ఏ మేరకు నిర్మూలిస్తుందనేది ముఖ్యం. ఆ ప్రాతిపదికన చూస్తే, ఈ బిల్లు ఖచ్చితంగా విజయవంతమైందని చెప్పవచ్చు. ఒకవేళ ఈ బిల్లు ఆశించిన రీతిలో అమలులోకి వస్తే, ట్రిబ్యునళ్ల వ్యవస్థలో గణనీయమైన మార్పులు వస్తాయనడంలో సందేహం లేదు. దీనివల్ల వ్యాజ్యదారులకు మెరుగైన వసతులు, ఖాళీల సత్వర భర్తీ మరియు జవాబుదారీతనంతో కూడిన పారదర్శకమైన వేదిక లభిస్తుంది. అంతేకాకుండా, ఇక్కడ ప్రతిపాదించిన ఈ నమూనా విజయవంతమైతే, భవిష్యత్తులో ఇతర నియామక ప్రక్రియలకు కూడా ఇది ఒక దిక్సూచిగా మారే అవకాశం ఉంది.



ఎన్.వెంకటరామన్
(రచయిత: భారతదేశ అదనపు సొలిసిటర్ జనరల్) - ఇక్కడ వ్యక్తం చేసిన అభిప్రాయాలు వారి స్వంతం.

# నిరసన హక్కు... నిరాకరించలేనిది!

**జాస్వామ్యమంటే అయిదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించడమొక్కటే కాదు- అవసరమైనప్పుడు తాము ఎన్నుకున్న ప్రభుత్వాలతో విభేదించేందుకు పౌరులకు వీలు కల్పించడం! సర్కారీ విధానాలను విమర్శించడానికి, నిరసన తెలపడానికి ప్రజలకు ఉన్న హక్కును గౌరవించడం! భారత సంవిధానమూ ఇదే సంగతిని స్పష్టీకరిస్తోంది. శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించడం రాజ్యాంగదత్తమైన ప్రాథమిక హక్కుల్లో అంతర్భాగమని న్యాయపాలిక సైతం ఇప్పటికే పలుమార్లు తేల్చిచెప్పింది. కానీ, ప్రతి ప్రజాందోళననూ రాజ్యంపై యుద్ధ ప్రకటనగా జమకట్టడం పోలీసుల్లో పలువురికి పరిపాటి అయ్యింది. ఆ క్రమంలో నిరసనకారులపై ఎక్కడికక్కడ విపరీతమైన బలప్రయోగం జరుగుతోంది. 'నీట్' పేపర్ లీకేజీ, తదనంతర పరిణామాలపై ఉద్యమించిన విద్యార్థులను ఢిల్లీ ఖాకీలు చావబాదడం పలు విమర్శలకు తావిచ్చింది. సంబంధిత వ్యాజ్యాల**



**విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తాజాగా స్పందిస్తూ- శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు నిరాకరించలేనిదని పునరుద్ఘాటించింది. దేశం స్వతంత్రమై దాదాపు ఎనభై ఏళ్లు కావొస్తున్నా మన అధికార యంత్రాంగం ఈ ప్రజాస్వామిక దృక్పథాన్ని అలవరచుకోకపోవడం, ముఖ్యంగా పోలీసులు తెల్లదొరల దమననీతికి దూరంకాకపోవడం విషాదకరం!**

అసమ్మతి అనేది ప్రజాస్వామ్యానికి 'సేఫ్టీవాల్వ్' వంటిది. తమ జీవితాలను దుర్భరం చేస్తున్న సమస్యలపై గొంతెత్తడానికి అవకాశం లేకపోతే ప్రజల్లో ఆగ్రహం అలాగే పేరుకుపోతుంది. ఎప్పుడోమారు అది హఠాత్తుగా పెల్లుబికి హింసాత్మక రూపుదాల్చి తీవ్ర సామాజిక అశాంతికి కారణమవుతుంది. ఆ ప్రమాదాన్ని నివారించే శాంతియుత నిరసనలు ఎన్నికలకూ ఎన్నికలకూ నడుమ ప్రజాభిప్రాయ వ్యక్తీకరణకూ ఉపకరిస్తాయి. కానీ, ఎప్పుడు ఎక్కడ ఎవరు ఎలాంటి డిమాండ్‌లతో రోడ్డుపైకి వచ్చినా గుడ్లురుముతూ విచక్షణారహితంగా లాఠీలకు పనిచెబుతున్న పోలీసుల మూలంగా ప్రజాస్వామ్య మూలసూత్రాలే క్షతగాత్రమవుతున్నాయి. 'ప్రణాళికాబద్ధమైన అహింసాయుత నిరసనలతోనే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. శాంతియుతంగా నిరసన తెలపడాన్ని ఓ ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం గుర్తించింది. పోలీసులు శాంతిభద్రతలను కాపాడటమెంత ముఖ్యమో అనవసర బలప్రయోగానికి దిగకపోవడమూ అంతే ప్రధానం. పోలీసుల అపరిమిత బలప్రయోగం వల్లే చాలా సందర్భాల్లో పరిస్థితులు దిగజారిపోతున్నాయి. మానవహక్కులతో పాటు మానవ గౌరవానికి కూడా విఘాతం కలిగించే పరిణామమిది' అని సర్వోన్నత న్యాయస్థానం లోగడ వ్యాఖ్యానించింది. ప్రజాందోళనలను మెరుగ్గా నిభాయించడంలో పోలీసులకు ప్రత్యేక శిక్షణ అవసరమని పేర్కొంది. ఆ మేరకు ఖాకీలకు సరైన తర్ఫీదును ఇప్పిస్తూ, వారు రాజ్యాంగానికి కట్టుబడి పనిచేసేలా చూడాల్సింది ప్రభుత్వాలే. అందులో అవి కచ్చితంగా సఫలం కావాల్సిందే!

ఆందోళనకారులు భారీసంఖ్యలో ఒకచోట గుమికూడినప్పుడు భావోద్వేగాలు తారాస్థాయిలో ఉంటాయి. ఆ సమయంలో వారితో నెమ్మదిగా మాట్లాడుతూ ఎవరూ కట్టుతప్పకుండా చూడటం పోలీసుల బాధ్యత. అరవడం, బెదిరించడం, తూలనాడటం వంటివి నిరసనకారులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. అప్పుడు పరిస్థితులు అనివార్యంగా అదుపు తప్పుతాయి. అలాంటివి చోటుచేసుకోకూడదంటే నిరసన ప్రదర్శనలు జరిగే చోట్లకు ఉన్నతాధికారులు వెళ్లి తమ సిబ్బందికి దిశానిర్దేశం చేయాలి. బలప్రయోగం తప్పనిసరి అయితే పోలీస్ మాన్యువళ్లు, ఇతర నియమాలకు అనుగుణంగానే చేయాలి. అంతేతప్ప భయోత్పాతాన్ని సృష్టించి అసమ్మతి స్వరాలను అణచివేయాలనుకుంటే అసలుకే మోసం వస్తుంది. పౌరహక్కులు ప్రమాదంలో పడే కొద్దీ సమాజంలో అరాచకం ప్రబలుతుంది. దేశాభివృద్ధి లక్ష్యాల సాధనకు అది అవరోధమవుతుంది!

# మన వ్యక్తిత్వానికి నిశ్శబ్ద పరిచయం!

**చూడగానే ఎదుటివారికి మన గురించి ఒక అభిప్రాయం ఏర్పడుతుంది. ఆ అభిప్రాయం సరైందా? కాదా? అనేది తర్వాత విషయం. కానీ చాలాసార్లు అదే మనకు అవకాశాల తలుపులు తెరుస్తుంది లేదా మూసేస్తుంది. ఉద్యోగ ఇంటర్వ్యూకు వెళ్లినా, కొత్త వ్యక్తిని కలిసినా, వేదికపై ప్రసంగించినా ఇదే జరుగుతుంది. మన మాటలకన్నా ముందే మన రూపం, వస్త్రధారణ, శుభ్రత మాట్లాడతాయి. అందుకే 'ఫస్ట్ ఇంప్రెషన్' ఎంతో విలువైంది. హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో నిర్వహించిన ఒక పరిశోధన ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. ముఖ్యంగా వైద్యులను చూసే రోగులు, వారు చూడగానే వైద్యుడిలా కనిపించాలని ఆశిస్తారని పరిశోధకులు గుర్తించారు. వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు నమ్మకం కలిగించే రూపం కూడా ఎంతో ముఖ్యమని ఆ అధ్యయనం చెబుతోంది.**

ప్రసిద్ధ వార్డ్‌రోబ్ కన్సల్టెంట్ బిల్ థర్‌ల్‌బీ ప్రకారం, దుస్తులను బట్టి ఇతరులు మన గురించి ఎన్నో అంచనాలు వేస్తారు. ఆర్థిక స్థితి, విద్య, వృత్తి, సామాజిక హోదా, అభిరుచి, ఆత్మవిశ్వాసం, విశ్వసనీయత, సక్సెస్, హుందాతనం, క్రమశిక్షణ... ఇలా పది అంశాలను తొలి చూపులోనే అంచనా వేయడానికి ప్రయత్నిస్తారట. ఆ అంచనాలు నిజమా కాదా అనేది వేరే విషయం. కానీ మొదటి అభిప్రాయం మాత్రం చాలాసార్లు అలాగే నిలిచిపోతుంది. అందుకే 'మంచివాడిగా ఉండటం' ఎంత ముఖ్యమో, 'మంచివాడిలా కనిపించడం' కూడా అంతే ముఖ్యం. నాలుగు శతాబ్దాల క్రితమే షేక్‌స్పియర్ కూడా హామ్లెట్ నాటకంలో ఇదే విషయాన్ని గుర్తు చేశాడు. 'ఖరీదైనదైనా ఆడంబరంగా కాకుండా, హుందాగా ఉండే వస్త్రధారణను ఎంచుకో' అని పొలోనియస్ తన కుమారుడికి ఇచ్చిన సలహా నేటికీ సందర్భోచితమే. సందర్భానికి తగిన, శుభ్రమైన, హుందాతనాన్ని ప్రతిబింబించే వస్త్రధారణే వ్యక్తిత్వానికి విలువను తీసుకొస్తుంది. కాలం మారింది, నాగరికత మారింది... కానీ తొలి అభిప్రాయం ఏర్పడే మనిషి మనస్తత్వం మారలేదు.

సైకాలజిస్టుల అభిప్రాయం ప్రకారం, ఒక వ్యక్తిని మొదటిసారి చూసిన కొన్ని క్షణాల్లోనే మన మెదడు తొలి అభిప్రాయాన్ని ఏర్పరచుకోవడం ప్రారంభిస్తుంది. 90 సెకన్లలో ఆ అభిప్రాయం బలపడే అవకాశం ఉంటుంది. అందుకే మన ఆహార్యం, బాడీ లాంగ్వేజ్, చిరునవ్వు, కంటి చూపు, మాట్లాడే తీరు... ఇవన్నీ కలిపి ఎదుటివారి మనసులో మనపై సదభిప్రాయమో, దురభిప్రాయమో కలిగిస్తాయి. అందుకే ప్రపంచంలోని అనేక దేశాల్లో ఉద్యోగ ఇంటర్వ్యూలు, కార్పొరేట్ సమావేశాలు, ప్రజా వేదికల కోసం ఎలా దుస్తులు ధరించాలి, ఎలా కనిపించాలి, ఎలా మసలుకోవాలి అనే అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాయి

అనంత
జనశక్తి
జనం కోసమే మా అక్షరం
మంగళవారం | అనంతపురం | 11.08.2026 | 01

# సకాలంలో ఫిర్యాదు లు పరిష్కరించండి.



**- ఆర్డిఓ వసంత్ కుమార్**

**కళ్యాణదుర్గం ఆగస్టు 10 జనశక్తి న్యూస్**

**రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార కొరకై ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ లో డివిజన్ వ్యాప్తంగా రైతులు వారి సమస్యలను అర్జీల రూపంలో ఫిర్యాదు చేసిన వెంటనే వారి మండల ఎగ్జిక్యూట్ రెవిన్యూ అధికారులకు తెలిపి సమస్య వేగవంతంగా సకాలంలో పురస్కరించేలా రైతులకు అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని. సోమవారం అధికారులకు ఆర్డిఓ వసంత్ ఆదేశాలు జారీ చేశారు.**

## పిజిఆర్ఎస్ వినతుల పరిష్కారంలో

# అధికారులు నిర్లక్ష్యం చేయరాదు



**- అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి**

**- రీ ఓపెన్ కి తావు లేకుండా అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**- పిజిఆర్ఎస్ లో స్వీకరించిన 622 దరఖాస్తులు**

**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం, ఆగస్టు 10:అనంత జనశక్తి న్యూస్**

పిజిఆర్ఎస్ వినతుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనందు పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్లోని రెవిన్యూ భవన్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల అర్జీలను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ స్వీకరించారు. కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, వెంకటనారాయణ, కిరణ్మయి ప్రజల ఆర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో వేగవంతంగా అర్జీలు పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే ప్రతి అర్జీ ప్రజల నమ్మకానికి నిదర్శనమని, అందుచేత వాటిని అత్యంత ప్రాధాన్యంతో, నాణ్యతతో, నిర్ణీత వ్యవధిలో పరిష్కరించడం అధికారులు తమ బాధ్యతగా భావించాలని సూచించారు. రీఓపెన్ అయిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ అర్జీలను నిరంతర ప్రక్రియగా తీసుకోవాలని, ప్రతి దరఖాస్తు ప్రగతి దశను అధికారులు స్వయంగా పర్యవేక్షించి ఆలస్యానికి తావు లేకుండా చూడాలని చూడాలన్నారు. ప్రజలు ఇచ్చిన ప్రతి విజ్ఞప్తిని సకాలంలో పరిష్కరించడం ద్వారా ప్రజలకు అధికారులపై నమ్మకం కలుగుతుందని ప్రతి అధికారి అర్జీదారుల సమస్యను బాధ్యతతో పరిష్కరించాలన్నారు.ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో ఉన్న చిన్న చిన్న సమస్యలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. పరిష్కరించలేని సమస్యలు ఏవైనా ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ వసతి గృహాల సంక్షేమ అధికారులకు సూచించారు.వసతి గృహాలలో ముఖ్యంగా పారిశుద్ధ్యం, విద్యార్థుల ఆరోగ్యం, త్రాగునీటిపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలన్నారు. ఈసారి ప్రతి విద్యార్థి పదవ తరగతిలో మంచి మార్కులతో పాసయ్యే విధంగా చూడాలన్నారు. హెచ్.ఎన్.ఎస్.ఎస్ మరియు హెచ్ ఎల్ సి ద్వారా వచ్చే నీరు కేవలం త్రాగునీటికే ఉపయోగించాలని ఎట్టి పరిస్థితుల్లో పంపింగ్ ద్వారా నీటిని ఇతర అవసరాలకు ఉపయోగించరాదన్నారు .అలాగే కెనాల్స్ లో ఏవైనా మరమ్మత్తులు ఉంటే ఆ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలన్నారు.పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో మొత్తం 622 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ సమస్యలన్నీ పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## తపాలా కార్యాలయంలో సేవలు బంద్



**- సిబ్బంది లేక ఖాళీ కుర్చీలే దర్శనం....**

**- తపాలా సేవల కోసం వచ్చిన ప్రజలకు నిరాశ...**

**ధర్మవరం ఆగస్టు 10 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని తపాలా కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తపాలా సేవలు నిలిచిపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివిధ అవసరాల నిమిత్తం తపాలా కార్యాలయానికి వచ్చిన ప్రజలకు సేవలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. తపాలా ఉత్తరాలు, పార్శిళ్లు, రిజిస్టర్ పోస్టులు, సేవింగ్స్ తదితర పనుల కోసం కార్యాలయానికి వచ్చిన వినియోగదారులు సిబ్బంది కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో పలు కౌంటర్ల వద్ద ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. దీంతో తమ పనులు పూర్తవుతాయనే ఆశతో వచ్చిన ప్రజలు నిరాశకు గురయ్యారు. చిన్నపాటి పోస్టల్ సేవల కోసం కూడా కార్యాలయానికి వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చిందని పలువురు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తపాలా కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తమ సమయం వృథా అయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు నిత్యం అవసరమైన తపాలా సేవలు అందించే కార్యాలయంలో ఇలాంటి పరిస్థితి నెలకొనడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని, సేవలు నిలిచిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ధర్మవరం తపాలా కార్యాలయంలో సిబ్బంది కొరత సమస్య పై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగినంత సిబ్బందిని అందుబాటులో ఉంచి, తపాలా సేవలను నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## హెచ్ఐవీ/ఎయిడ్స్ పై ప్రజలకు

# పూర్తి అవగాహన కల్పించాలి

**- ఎయిడ్స్ అవగాహనపై పోస్టర్లు, బుక్‌లెట్లను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

**అనంతపురము, ఆగస్టు 10:అనంత జనశక్తి న్యూస్**




హెచ్ఐవీ/ఎయిడ్స్ మరియు లైంగిక సంక్రమణ వ్యాధుల (STIs) నివారణ, పరీక్షలు, చికిత్స మరియు వివక్ష నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించనున్న విస్తృత స్థాయి సమాచార, విద్యా మరియు కమ్యూనికేషన్ (IEC) కార్యక్రమాల పోస్టర్లు, బుక్‌లెట్లను జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ సోమవారం రెవెన్యూ భవన్ నందు విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ, హెచ్ఐవీ నియంత్రణలో ప్రజల అవగాహన అత్యంత కీలకమని పేర్కొన్నారు. హెచ్ఐవీ వ్యాప్తిని నివారించడం, ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం, చికిత్సను సకాలంలో పొందడం మరియు హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తులపై వివక్షను తొలగించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు.జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12, 2026 వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక ఐఈసీ కార్యక్రమాల ద్వారా హెచ్ఐవీ నివారణ చర్యలు, స్వచ్ఛంద హెచ్ఐవీ పరీక్షల ప్రాముఖ్యత, చికిత్సను నిరంతరంగా కొనసాగించాల్సిన అవసరం, అలాగే హెచ్ఐవీ పట్ల సమాజంలో ఉన్న అపోహలు మరియు వివక్షను తొలగించే అంశాలపై విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు.జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డా. జయలక్ష్మి మాట్లాడుతూ, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం (NACP) ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువత, అధిక ప్రమాదంలో ఉన్న వర్గాలు మరియు సాధారణ ప్రజలకు చేరువయ్యేలా పోస్టర్లు, కరపత్రాలు, అవగాహన సమావేశాలు, కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమాలు తదితర మార్గాల ద్వారా ప్రచారం నిర్వహించనున్నట్లు వివరించారు.జిల్లా సూపర్వైజర్ జి.వి. రమణ మాట్లాడుతూ, ఈ రెండు నెలల కాలంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మరియు కళాశాలల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్ మరియు లైంగిక సంక్రమణ వ్యాధులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే హెచ్ఐవీ సంక్రమణకు అధిక అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో కళాజాత బృందాల ద్వారా, మొబైల్ ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి మలోల, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, ఇతర జిల్లా అధికారులు, లింక్ వర్కర్స్ ప్రోగ్రామ్ డి ఆర్ పి రమేష్ యాదవ్, వారి సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి



**- అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి**

**- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్**

**పుట్టపర్తి,ఆగస్టు,10:అనంత జనశక్తి న్యూస్**

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (PGRS) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 331 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య,ఎస్‌డిసి విజయ కుమారి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి అండగా కూటమి ప్రభుత్వం



**- 50 మంది లబ్ధిదారులకు రూ.36.57 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

**కదిరి, ఆగస్టు 10:అనంత జనశక్తి న్యూస్**

కదిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాలకు అండగా నిలుస్తూ, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అందజేశారు.కదిరి పట్టణ ఆర్ అండ్ బి వసతి గృహం నందు నిర్వహించిన కార్యక్రమంలో కదిరి నియోజకవర్గానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.36,57,468 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు అనారోగ్యం, వైద్య చికిత్స ఖర్చులు ఆర్థికంగా భారంగా మారకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పేదల వైద్య అవసరాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వేగంగా ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కదిరి నియోజకవర్గంలో ఇప్పటివరకు 654 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.5,49,45,785 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ, కదిరి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు .ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి, రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.సీఎంఆర్ ద్వారా ఆర్థిక సహాయం అందించినందుకు లబ్ధిదారులు ముఖ్యమంత్రి కి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## కొత్తపేటలో టీడీపీ డోర్ టు డోర్ ప్రచారం

**- కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన**

**అనంతగిరి, ఆగష్టు 10: అనంత జనశక్తి న్యూస్**

అరకు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, ఏపీఎస్ఆర్టీసీ జోన్ చైర్మన్ ఆదేశాల మేరకు అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ పరిధిలోని కొత్తపేట గ్రామంలో టీడీపీ నాయకులు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఎం. భీమరాజు, మూడు పంచాయతీల యూనిట్ ఇన్‌చార్జి బి.సన్యాసిదేముడు పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లలో అమలు చేసిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సంక్షిప్తంగా వివరించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసి, సంబంధిత కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో అప్రూవ్ చేయడం జరిగింది అని నాయకులు తెలిపారు.



# నలుగురు బిఎల్ఓల సస్పెన్షన్..

**- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్.**

**అనంతపురం, ఆగస్టు 10 :అనంత జనశక్తి న్యూస్**

**గుత్తి అర్బన్ పరిధిలోని నలుగురు బిఎల్ఓల సస్పెన్షన్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ క్రమంలో గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని గుత్తి అర్బన్‌లో 13 కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయబడ్డాయని, వాటికి బిఎల్ఓలను నియమించగా, గుత్తి అర్బన్‌లోని వార్డు నంబర్ 223కి చెందిన వార్డు రెవెన్యూ కార్యదర్శి శాంతకుమారి, వార్డు నంబర్ 231కి చెందిన వార్డు వార్డ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ బి.అనిల్ బాబు, వార్డు నంబర్ 241కి చెందిన సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శి టి.గంగాధర్, వార్డు నంబర్ 254కి చెందిన వార్డ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ వై.నాగేశ్వరి ఎన్నికల ప్రక్రియలో అనవసరమైన జాప్యం మరియు అసౌకర్యాన్ని కలిగించడం ద్వారా, ఎలక్షన్ పోర్టల్‌లో తమ వివరాలను నవీకరించడంలో సహకరించడానికి నిరాకరించి, తమ చట్టబద్ధమైన ఎన్నికల విధులను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసి, నిర్వర్తించడంలో విఫలమైనందున, సదరు కొత్తగా నియమితులైన నలుగురు బూత్ స్థాయి అధికారులపై (BLOS) క్రమశిక్షణా చర్యలు ప్రారంభించాలని ERO గుంతకల్ అభ్యర్థించారని, అందుకనుగుణంగా ఆర్పీ చట్టం నిబంధనల మేరకు చర్యలు తీసుకుని వారిని సస్పెన్షన్ చేయడం జరిగిందని ఆ ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.**

# విద్యార్థుల ప్రయోజనాలకు విజ్ఞాన సూచిక మాసపత్రిక విశేష కృషి:

**- ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్**

**అనంతపురం, ఆగస్టు 10:అనంత జనశక్తి న్యూస్**



శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ గారిని శ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి మరియు విజ్ఞాన సూచిక మాసపత్రిక ఎడిటర్ డాక్టర్ ఎం. జైనుల్లా ఉద్దీన్ మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా విజ్ఞాన సూచిక మాసపత్రిక సలహా కమిటీ సభ్యులైన ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ మాట్లాడుతూ, విజ్ఞాన సూచిక మాసపత్రిక గత పన్నెండు సంవత్సరాలుగా విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరమైన సమాచారాన్ని అందిస్తూ సేవలందించడం అభినందనీయమని ప్రశంసించారు.డాక్టర్ ఎం. జైనుల్లా ఉద్దీన్ మాట్లాడుతూ, ఎంతో అనుభవజ్ఞులైన ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ నాయకత్వంలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అలాగే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని వివిధ కళాశాలల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అన్న క్యాంటీన్ల ద్వారా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పథకం అమలైతే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.అదేవిధంగా, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో విశ్వవిద్యాలయం తరపున పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించాలని డాక్టర్ జైనుల్లా ఉద్దీన్ కోరారు.విద్యార్థుల విద్య, ఉపాధి అవకాశాల మెరుగుదలకు అవసరమైన కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఉపకులపతి తెలిపారు.

# వేంగడ పంచాయతీలో ఉద్యానవన మొక్కల పంపిణీ



**76 మంది రైతులకు చేయూత.. 190 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం**

**అనంతగిరి,ఆగస్టు 10:అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం వేంగడ గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం సిబ్బంది ఆధ్వర్యంలో ఉద్యానవన పంటల మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు, టీఏ చలం హాజరయ్యారు.వేంగడ పంచాయతీ పరిధిలోని అర్హులైన రైతులకు వివిధ రకాల ఉద్యానవన పంటల నాణ్యమైన మొక్కలను పంపిణీ చేశారు. సుమారు 190 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగుకు ఈ మొక్కలను అందజేసినట్లు అధికారులు తెలిపారు.మొక్కల సంరక్షణ, పెంపకం, సకాలంలో ఎరువులు, నీటి యాజమాన్యంపై రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2026-27 ఆర్థిక సంవత్సరంలో రైతుల ఆదాయాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో నాణ్యమైన ఉద్యానవన మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని మొక్కలను శ్రద్ధగా సంరక్షిస్తే భవిష్యత్తులో మంచి దిగుబడులతో పాటు ఆర్థికంగా లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది కృష్ణ, గురుమూర్తి, పేసా కార్యదర్శి మాణిక్‌చందర్, మాజీ వార్డు సభ్యుడు మజ్జి గోవింద్, గోమంగి మోహన్, మజ్జి రాము, గోమంగి ప్రసాద్, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ వినతులకు చట్టబద్ధ పరిష్కారం చూపాలి



**- జిల్లా ఎస్పీ పి. జగదీష్**

**అనంతపురం, ఆగస్టు 10,అనంత జనశక్తి న్యూస్**

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు ఎలాంటి జాప్యం లేకుండా చట్టబద్ధమైన పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి స్వయంగా 106 వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులు అందజేసే ప్రతి వినతినీ బాధ్యతాయుతంగా విచారించాలని సూచించారు. ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్లకు పంపి, నిర్దేశిత గడువులోగా విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. విచారణ పూర్తయిన అనంతరం సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం అందించి, సమస్య పరిష్కారంపై వారి సంతృప్తిని నిర్ధారించుకోవాలన్నారు.ప్రజల సమస్యలు పునరావృతం కాకుండా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పోలీసు సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని అన్నారు.కాగా, జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన బాధితులకు వినతుల నమోదులో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించారు. వినతులు సమర్పించేందుకు వచ్చిన పిటిషనర్లు, వారితో వచ్చిన ప్రజలకు ఇస్కాన్ సంస్థ సహకారంతో ఉచిత భోజన సదుపాయం కల్పించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్‌తో పాటు అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం కూడా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

# ఎఫ్‌సీవీ పొగాకు రైతుకు నష్టం రానివ్వం

**-నిర్ణయించిన ధరలకు రేపటి నుంచే కొనుగోళ్లు జరగాలి**
**నిబంధనలు పాటించని కంపెనీలపై కఠిన చర్యలు**
**ప్రతి పొగాకు రైతుకు రూ.50 వేల వడ్డీలేని రుణం**
**ఆఫ్‌స్టైల్, లో గ్రేడ్ పొగాకుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సాయం**
**వచ్చే సీజన్‌లో 80 మిలియన్ కేజీలకు మించి సాగుకు అనుమతి లేదు**
**పొగాకు రైతుల కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**గుంటూరు, ఆగస్టు 10:అనంత జనశక్తి ప్రతినిధి**



ఎఫ్‌సీవీ పొగాకు రైతులను ప్రస్తుత సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు, ధరలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, పొగాకు పండించే ప్రాంతాల శాసనసభ్యులు, పొగాకు బోర్డు చైర్మన్, ఈడీ, కొనుగోలు సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రాంతాల రైతులతో సుమారు రెండు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. రైతుల సమస్యలు, కంపెనీల కొనుగోలు తీరు, ధరల అమలుపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగినట్లు మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. పొగాకు బోర్డు 140 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, గత సీజన్ చివరిలో మంచి ధరలు రావడంతో రైతులు ఆశతో సాగును పెంచారని, ఫలితంగా సుమారు 240 మిలియన్ కేజీల వరకు పొగాకు ఉత్పత్తి జరిగిందన్నారు. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, సిగరెట్లకు సంబంధించిన పరిణామాలు తదితర కారణాలతో ధరలు తగ్గాయని పేర్కొన్నారు. పొగాకు బోర్డు ఏర్పడిన తర్వాత రైతుల సమస్యలపై ఈ స్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి మరొకరు లేరని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆరుసార్లు గంటల తరబడి సమావేశాలు నిర్వహించి, ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎఫ్‌సీవీ పొగాకు రైతులను ఈ సంక్షోభం నుంచి బయటపడేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. కేంద్ర వాణిజ్య శాఖతో పాటు కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్ తోను పలుమార్లు చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చేందుకు ప్రయత్నించామని చెప్పారు.రైతులకు అదనపు ఆర్థిక సహాయం అందించే అంశంపై తొలుత కేంద్రంతో చర్చలు జరిపామని, అయితే ఇతర పొగాకు పండించే రాష్ట్రాల నుంచి కూడా ఇలాంటి డిమాండ్లు వచ్చే అవకాశం ఉందన్న కారణంతో ఆ ప్రతిపాదన ముందుకు సాగలేదన్నారు. దీంతో అధికారులు, రైతులు, పొగాకు బోర్డు ప్రతినిధులతో మరోసారి చర్చించి ఈ ఏడాది రైతులకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని వివరించారు. పొగాకును నాలుగు గ్రేడ్లుగా విభజించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే తక్కువకు కొనుగోలు చేయవద్దని కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. బ్రైట్ గ్రేడ్‌కు కిలో రూ.230కు తగ్గకుండా, మీడియం గ్రేడ్‌కు రూ.190కు తగ్గకుండా, ఆఫ్‌స్టైల్‌కు రూ.130కు తగ్గకుండా, లో గ్రేడ్‌కు రూ.110కు తగ్గకుండా కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 5వ తేదీన ముఖ్యమంత్రి ఈ ధరలపై నిర్ణయం తీసుకున్నారని, అనంతరం కేంద్ర సహాయ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పొగాకు బోర్డు అధికారులు, ట్రేడర్లతో మాట్లాడి నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారని తెలిపారు.అయితే కొన్ని కంపెనీలు క్షేత్రస్థాయిలో నిర్ణయించిన ధరలను పాటించడం లేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. అందుకే ఈరోజు ప్రత్యేక సమావేశం నిర్వహించి కంపెనీలకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. "రేపటి నుంచి నాలుగు గ్రేడ్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగానే ప్లాట్‌ఫారమ్‌లపై కొనుగోళ్లు జరగాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తప్పవు" అని మంత్రి హెచ్చరించారు. కంపెనీల ప్రతినిధులు తమ యాజమాన్యాలతో మాట్లాడి రేపటి నుంచి నిర్ణయించిన ధరలకు కట్టుబడి కొనుగోళ్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పొగాకు బోర్డు రైతులు చెల్లించిన నిధులతోనే నడుస్తున్న నేపథ్యంలో రైతులకు తిరిగి అండగా నిలవాల్సిన బాధ్యత బోర్డుపై ఉందని కేంద్రానికి స్పష్టం చేశామని మంత్రి తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించి ప్రతి రైతుకు రూ.50 వేల చొప్పున రెండు సంవత్సరాలపాటు వడ్డీలేని రుణం అందించేందుకు అంగీకరించారని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ, పొగాకు బోర్డు సమన్వయంతో తక్షణమే కార్యాచరణ చేపట్టి బోర్డు అనుమతితో పొగాకు సాగు చేసిన రైతులతో పాటు అనుమతి లేకుండా సాగు చేసిన రైతులు, కౌలు రైతులు సహా అర్హులైన ప్రతి పొగాకు రైతుకు రూ.50 వేల చొప్పున రెండు సంవత్సరాల వడ్డీలేని రుణం అందించేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు.దీనితోపాటు ఆఫ్‌స్టైల్, లో గ్రేడ్ పొగాకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అండగా నిలవాలని నిర్ణయించిందన్నారు. 94 మిలియన్ కేజీల ఆఫ్‌స్టైల్, లో గ్రేడ్ పొగాకుకు క్వింటాల్‌కు రూ.1,000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందించాలని నిర్ణయించిందని, అంటే కిలోకు రూ.10 మేర అదనపు సాయం అందుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలోనే పొగాకు రైతులకు నిజమైన మేలు జరుగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పొగాకు విక్రయం జరిగిన అనంతరం రైతుల వివరాలను గుర్తించి, సంబంధిత రైతుకు రావాల్సిన మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ విధానంలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వచ్చే సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ 80 మిలియన్ కేజీలకు మించి ఒక్క కేజీ పొగాకు కూడా అదనంగా సాగు కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విత్తనాల సరఫరా దశ నుంచే నియంత్రణ తీసుకొచ్చి, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సాగును పరిమితం చేయడం ద్వారా రైతులకు స్థిరమైన ధర లభించేలా ముందుకెళ్తామని చెప్పారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇన్ని చర్యలు చేపడుతున్నా కొందరు ప్రతి అంశాన్ని రాజకీయంగా మార్చి విమర్శలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి అవగాహన లేకుండా మాట్లాడితే అర్థం చేసుకోవచ్చని, కానీ నిన్నటి వరకు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ కు వాస్తవాలు తెలిసి కూడా రైతుల విషయంలో రాజకీయ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 2019లో వైసీపీ హయాంలో రాష్ట్రంలో సుమారు 121 మిలియన్ కేజీల ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తి కాగా ధరలు తీవ్రంగా పడిపోయి రైతులు ఆందోళనకు దిగిన పరిస్థితులను అప్పటి ప్రభుత్వం ఎదుర్కొందని మంత్రి గుర్తుచేశారు. కేవలం మార్క్‌ఫెడ్ ద్వారా 10.5 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు చేసి చేతులు దులుపుకున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో అప్పటి ప్రభుత్వం చూపిన తీరు ఏమిటో, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతులను ఆదుకునేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటో రైతులే గమనిస్తున్నారని అన్నారు. "రైతుకు నష్టం వస్తే చూస్తూ ఊరుకునే ప్రభుత్వం మాది కాదు. మార్కెట్‌లో ఎన్ని ప్రతికూల పరిస్థితులు వచ్చినా రైతుకు సాధ్యమైనంత మేలు చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం. ఎఫ్‌సీవీ పొగాకు రైతులను ఈ ఏడాది సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కేంద్రం, రాష్ట్రప్రభుత్వం, పొగాకు బోర్డు సమన్వయంతో అవసరమైన ప్రతి చర్య తీసుకుంటాం" అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# అమర జవాన్ మురళీ నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కలెక్టర్, ఎస్పీ

**- దేశం కోసం మురళీ నాయక్ చేసిన త్యాగం రాబోయే తరాలకు ప్రేరణదాయకం**
**- అమర జవాన్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుంది**

**పుట్టపర్తి, ఆగస్టు 10:అనంత జనశక్తి న్యూస్**





దేశ సరిహద్దు రక్షణలో ప్రాణాలను అర్పించిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన అమర జవాన్ మురళీ నాయక్ జ్ఞాపకార్థం పుట్టపర్తి శిల్పారామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మరియు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శనివారం ఘనంగా ఆవిష్కరించారు .ఈ సందర్భంగా అమర జవాన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...
"2025 మే 9న జమ్మూ కాశ్మీర్ సరిహద్దులోని నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్ బలగాలు జరిపిన కాల్పులను ధీటుగా ఎదుర్కొంటూ మురళీ నాయక్ అత్యున్నత త్యాగం చేశారు. చిన్న వయస్సులోనే దేశం కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం వర్ణనాతీతం. ఆయన ధైర్యసాహసాలు, దేశభక్తి రాబోయే తరాలకు, జిల్లా యువతకు నిరంతరం ప్రేరణగా నిలుస్తాయి. అమర వీరుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు." జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...
"మాతృభూమి రక్షణ కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్ అమరత్వం అమూల్యమైనది. సరిహద్దుల్లో మన సైనికులు అహర్నిశలు శ్రమిస్తుండటం వల్లే మనమందరం సురక్షితంగా ఉన్నాం. ఆయన వీరగాథను శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు."ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ ,జిల్లా స్థాయి అధికారులు, ఆర్మీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అమర జవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అమర వీరుడికి శ్రద్ధాంజలి ఘటించారు.

# గ్రామీణ విద్యార్థుల కోసం 7,300 సైకిళ్ల పంపిణీ




**- అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి అడుగులు వేస్తాం: ఎమ్మెల్యే అమిలినేని**

**శెట్టూరు ఆగస్టు 10 అనంత జనశక్తి న్యూస్**

గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలిచి, విద్యకు ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. సరైన రవాణా సౌకర్యం లేక పాఠశాలలకు నడుచుకుంటూ వెళ్లే 9, 10 తరగతులు, ఇంటర్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు సైకిళ్లు అందిస్తున్నట్లు తెలిపారు.శెట్టూరు మండలం మాకోడికి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామీణ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల, స్థానిక నాయకులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు పాఠశాల యూనిఫాం, బూట్లు, బెల్టు, బ్యాగులు, పుస్తకాలు అందిస్తున్నామని, నాణ్యమైన సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తూ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.ఎస్సార్సీ సంస్థ తరపున రూ.5 కోట్ల వ్యయంతో నియోజకవర్గ వ్యాప్తంగా 7,300 సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సంస్థలో పనిచేస్తున్న సుమారు 7,000 మంది సిబ్బంది శ్రమ ఉందన్నారు. మారుమూల గ్రామాల నుంచి పుస్తకాల బ్యాగులు మోసుకుంటూ విద్యార్థులు నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్తున్న దృశ్యాలను చూసి బాధ కలిగిందని, వారి ఇబ్బందులను తొలగించాలనే ఉద్దేశంతో సైకిళ్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారిని మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచి చదువుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించేలా చూడాలని సూచించారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మధ్యాహ్న భోజనం నుంచి గుడ్లు, గరిటలు, జగ్‌లు, బ్యాగులు, పుస్తకాలు, బెల్టులు, టైలు వరకు వ్యక్తిగత ప్రచారానికి ఉపయోగించారని ఆరోపించారు.అమ్మఒడి పథకం కింద గత ప్రభుత్వం రూ.5,500 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నా వారందరికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తూ రూ.10,190 కోట్లు కేటాయించిందన్నారు. సుమారు 30 వేల మంది అంగన్‌వాడీ సిబ్బందికి కూడా తల్లికి వందనం అందించామని తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. తిమ్మసముద్రం ప్రాంతంలో ఇప్పటికే ఉన్న 1,200 ఎకరాలకు మరో 3,000 ఎకరాలు సమీకరించి రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు భూముల విలువలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు.అనంతరం ఎమ్మెల్యే స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ రెండేళ్ల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు.

# అనంత ఛాంపియన్షిప్ లో మెరిసిన విజన్ విద్యార్థి శ్రీరంగ కుమార్

**యాడికి, ఆగష్టు 11, అనంత జనశక్తి న్యూస్ :**

అనంత ఛాంపియన్షిప్ నియోజకవర్గ స్థాయిలో విజన్ విద్యార్థి శ్రీరంగ కుమార్ సత్తా చాటినారు. తాడిపత్రి పట్టణంలోని అరబిందో పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీలు సోమవారం నిర్వహించారు.అథ్లెటిక్స్ పోటీల నందు 600 మీటర్ల రన్నింగ్ రేసు నందు శ్రీరంగ కుమార్ మూడో స్థానంలో, డిస్క్ త్రో విభాగం నందు రెండవ స్థానంలో నిలిచి నియోజకవర్గంలో యాడికి పాఠశాలకు మంచి పేరు తెచ్చినారని ,మెడల్స్ అందుకోన్నారని కరస్పాండెంట్ విశ్వనాథ్ తెలిపారు.శ్రీరంగ విజయం పట్ల విజయం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఏపీ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబే



**- పుట్టపర్తిని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుదాం: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

**నల్లమాడ, ఆగస్టు 10 (అనంత జనశక్తి న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడే బ్రాండ్ అంబాసిడర్ అని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పుట్టపర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.నల్లమాడ మండలం చారుపల్లి పంచాయతీలో సోమవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పార్వతమ్మతో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గానికి భారీ పరిశ్రమలు, పెట్టుబడులు రావడం ఈ ప్రాంత ప్రజలకు గొప్ప వరమన్నారు. సుమారు రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీకి సంబంధించిన భారీ ప్రాజెక్టు ఏర్పాటు కానుండటం ప్రాంత అభివృద్ధిలో చారిత్రాత్మక ముందడుగు అని పేర్కొన్నారు. అలాగే ఆమడగూరు ప్రాంతంలో సుమారు రూ.51 వేల కోట్లతో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు కానుండటంతో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను తీసుకువచ్చి పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను పెంచుతూ పుట్టపర్తి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు.

**డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి**

డీఎస్సీ విషయంలో వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. యువత, నిరుద్యోగులను అయోమయానికి గురిచేయకుండా వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు.మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్‌ను వైసీపీ అధినేత జగన్ స్వీకరించి అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి, ఉద్యోగాలు, సంక్షేమంపై అసెంబ్లీలో చర్చించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**స్థానిక ఎన్నికల్లో కూటమికి భారీ మెజార్టీ ఇవ్వాలి**

పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పల్లె సింధూర రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వానికి భిన్నంగా అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, అందరి భాగస్వామ్యంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం.



**- డివిజన్ స్థాయిలో ప్రజల పరిష్కారాలే ప్రభుత్వ లక్ష్యం.**
**- ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి.**

**ధర్మవరం ఆగస్టు 10, అనంత జనశక్తి న్యూస్:**

డివిజన్ స్థాయిలో ప్రజల సమస్యలకు పరిష్కారాలను చూపించడమే మా లక్ష్యము అని ఆర్డిఓ రామ భూపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన తర్వాత అధికారుల ద్వారా సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని వారు ఆదేశించారు. అనంతరం ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రజల ద్వారా రెవెన్యూ కార్యాలయమునకు 5, సర్వే సెటిల్మెంట్ కు ఆరు, ఎస్జీహెచ్ డబ్ల్యు కు ఒకటి, మొత్తము 12 రావడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ పరిధిలో బత్తలపల్లి 2, సికేపల్లి 2, ధర్మవరం ఆరు, కనగానపల్లి జీరో, ముదిగుబ్బ జీరో, రామగిరి జీరో, తాడిమర్రి 2 మొత్తం వెలిసి 12 రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

# నేతన్న సేవ పథకం లో అవినీతి అక్రమాలపై నిగ్గు తేల్చాలి .

**పట్టణ కదిరి రైల్వే గేట్ వద్ద చేనేత కార్మికులు రోడ్డుపై ధర్నా.**
**-పోలీసులు, హ్యాండ్లూమ్ అధికారులు హామీతో సమ్మె విరమణ**
**-ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటనారాయణ.**

**ధర్మవరం ఆగస్టు 10, అనంత జనశక్తి న్యూస్:**



రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల యొక్క సమస్యలు ప్రభుత్వాలు పరిష్కరించకపోవడంతో, నేతన్న నేస్తంలో జరిగిన అవకతవకలపై వందలాది మంది చేనేత కార్మికులు పట్టణంలోని కదిరి రైల్వే గేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమం కొన్ని గంటల పాటు నిర్వహించారు. అనంతరం పోలీసులు హ్యాండ్లూమ్ అధికారులను హుటాహుటిన పిలిపించి వారి ద్వారా ఐదు రోజులలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. అనంతరం ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట నారాయణ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేతన్నసేవ పథకంలో జరిగిన అవినీతి అక్రమాలపై నిగ్గు తేల్చాలని వారు డిమాండ్ చేశారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగష్టు 7 వ తేదిన అమలు చేసారు కానీ ఆ పథకం లో సచివాలయం సిబ్బంది చేతి వాటం తో అర్హులైన చేనేత కార్మికులకు కాకుండా ఇతరులకు నేతన్న సేవ పథకం డబ్బులు జమ అయ్యేవిధంగా చేశారని వారు మండిపడ్డారు. చేనేత కార్మికుల కదిరి గేటు వద్ద నేతన్న విగ్రహం దగ్గర చేనేత కార్మికులు ధర్నా నిర్వహిస్తూ మా బాధను వ్యక్తం చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సచివాలయాలలో ఐఏఎస్ అధికారులతో విచారణ జరిపించి చేనేత కార్మికులకు న్యాయం చేయాలని తెలిపారు. ఆగస్టు 11వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఆర్డీవో ఆఫీస్ దగ్గర అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న సేవ పథకం 25 వేల రూపాయలు వెంటనే బ్యాంకు ఖాతాలలో జమ చేయాలని ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు గుర్రం వెంకటస్వామి, రవి కుమార్, రమణ, పెద్ద ఎత్తున చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# శివాలయాలలో ప్రత్యేక పూజలు

**యాడికి, ఆగష్టు 11,అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలోని భైరవ కొండపై ఉన్న భైరవ లింగేశ్వర శివాలయంలోను, అయ్యప్ప స్వామి దేవాలయంలో ను ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలోను, భోగలింగేశ్వర స్వామి దేవాలయంలోను, ఉన్నత పాఠశాల వెనుక ఉన్నశ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలోను, కోనలో ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలోను, పలు శివాలయాలలోను సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శివునికి అభిషేకాలు చేసి, వివిధ పూలమాలతో అలంకరించారు. అర్చనలు చేసి, హారతులను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివున్ని దర్శించి, టెంకాయలను సమర్పించారు.కరుణించవయ్యా.........భోలా శంకర అని వేడుకొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు, భక్తులు పాల్గోన్నారు.

# కార్మిక, కర్షక పోరాటానికి సన్నాహమే జైల్‌భరో

**- రాప్తాడులో సీఐటీయూ, రైతు సంఘాలఆధ్వర్యంలో ర్యాలీ హైవే బంద్**

**రాప్తాడు ఆగస్టు 10 అనంత జనశక్తి న్యూస్**




రాప్తాడు: దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి హైవే బంద్ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బాల రంగయ్య, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి. రామాంజనేయులు మాట్లాడుతూ.. రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు సి2+50 శాతం మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు పెరిగి దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ, విద్యుత్, విత్తనాలు, ఎరువులు, భూసేకరణ, పంటల బీమా రంగాల్లో చేస్తున్న మార్పులు రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. అదేవిధంగా నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేసి కార్మికుల హక్కులను కాపాడాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పోతులయ్య, ఏటీపీ రూరల్ మండల నాయకులు పుష్పరాజు, సుబ్బిరెడ్డి, అంగన్వాడీ, హమాలీ, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ సంక్షేమం.. ప్రజల ముంగిటకు అభివృద్ధి



**రాప్తాడు ఆగస్టు 10 అనంత జనశక్తి న్యూస్**

రెండేళ్ల పాలనపై ఎం.చెర్లోపల్లిలో ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా రాప్తాడు మండలం ఎం.చెర్లోపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాప్తాడు మండల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ధర్మవరపు మురళి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మారూరు కేశవ, ఆదిశేషు కుమార్, బోయ గోపాల్, బోయ రాము, సర్పంచ్ బాబయ్య, మోహన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, క్లస్టర్ బొగానేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువగా కూటమి పాలన.. ఇంటింటికీ సంక్షేమ పథకాల ప్రచారం..



**గాండ్లపెంట, ఆగస్ట్,10, అనంత జనశక్తి న్యూస్,**

మండల కేంద్రంలోని గాండ్లపెంట పంచాయతీలో సోమవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తెలుగుదేశంకార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ ప్రసాద్, ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు రాష్ట్రంలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ధోనికొండ ఆనంద్, అక్రమ్, ఫీల్డ్ అసిస్టెంట్ బాబుద్దీన్, ప్రసాద్, చౌడయ్య, ఖాజావలి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినిలతో అసభ్య ప్రవర్తన..

**యల్లనూరు, ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్ ;**

యల్లనూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు అదే పాఠశాలలోని తరగతుల విద్యార్థినిలు (అమ్మాయిల)తో అసభ్యంగా ప్రవర్తిస్తుండడంపై వారి తల్లిదండ్రులు సోమవారం పాఠశాల వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ కు సమస్యను విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన పాఠశాలకు చేరుకుని విద్యార్థులను విచారించారు. ఆయన విచారణలో సదురు ఉపాధ్యాయుడి వికృత చేష్టలను విని అసహనాన్ని వ్యక్తం చేసి, జరిగిన సంఘటనను పూర్తిస్థాయిలో విద్యార్థులు నుండి లిఖితపూర్వకంగా తీసుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని జిల్లా స్థాయి అధికారులకు తెలియజేశారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులకు నివేదికను పంపనున్నట్లు ఆయన తెలిపారు.

**మారని ఉపాధ్యాడి తీరు.....**

అయితే సదరు ఉపాధ్యాయుడు ఏడాది క్రితం ఇలాగే వ్యవహరించడంతో ప్రధానోపాధ్యాయుడు, తోటి ఉపాధ్యాయులు మందలించడం జరిగిందని , కానీ ఆయన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదనడానికి ఈరోజు జరిగిన సంఘటన అద్దం పడుతోంది.




# మెగా డీఎస్సీ కాదు... దగా డీఎస్సీ

**- మెగా డీఎస్సీలో అవకతవకలపై నిగ్గు తేల్చాలి.**
**- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి.**

**ధర్మవరం ఆగస్టు 10, అనంత జనశక్తి న్యూస్:**




గత సంవత్సరం నిర్వహించడం మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు డీఎస్సీలో జరిగిన అక్రమాలపై నిరసన చేస్తూ వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ను పట్టణంలో నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. తదుపరి ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.... ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ పేరుతో మోసం చేసి ఉద్యోగాలను లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారని వారు మండిపడ్డారు. అదేవిధంగా స్పోర్ట్స్ కోటాను పెంచడం రెండు శాతం నుండి మూడు శాతం పెంచుతూ జీవో ను విడుదల చేయడం కూడా జరిగిందన్నారు. మొత్తం మీద వ్యవహారంలో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని వారు చేయబట్టారు. మెగా డీఎస్సీ ప్రశ్నాపత్రాలను అవుట్ సోర్సింగ్ సిబ్బందికి అప్పగించడం అవినీతి కాదా అని వారు నిలదీశారు. డీఎస్సీ పై జరిగిన అక్రమాలపై ఆధారాలతో సహా వైఎస్ఆర్సిపి బయట పెట్టినప్పటికీ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని వారు తెలిపారు. కావున ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వాడు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం, వైయస్సార్ విద్యార్థి విభాగం మున్సిపల్ విభాగం పట్టణ ధర్మవరం బత్తలపల్లి ముదిగుబ్బ తాడిమర్రి రూరల్ మండలాల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లండన్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన

**- అమరావతి ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ ప్రతినిధులతో చర్చ**

**లండన్, ఆగస్టు 10:అనంత జనశక్తి ప్రతినిధి**



అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రి నారాయణ నేతృత్వంలోని అధికారుల బృందం లండన్‌లో పర్యటిస్తోంది. అధికారిక పర్యటనలో భాగంగా మంత్రి నారాయణ, అధికారులు రాత్రి లండన్ చేరుకున్నారు. లండన్ పర్యటనలో భాగంగా మంత్రి నారాయణ బృందం అమరావతి ఐకానిక్ భవనాల డిజైన్లు రూపొందించిన ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు.అమరావతిలో నిర్మిస్తున్న అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్ల వెలుపలి డిజైన్లు (Facade)పై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనుల తీరుతో పాటు, భవిష్యత్తులో ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రక్రియకు సంబంధించి ఆర్కిటెక్ట్‌లు, కన్సల్టెన్సీ, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ చర్చించారు.

**అసెంబ్లీ భవనం పైభాగంలోని టవర్‌పై ప్రత్యేక చర్చ**

అమరావతి అసెంబ్లీ భవనం పైభాగంలో నిర్మించనున్న ఎత్తైన టవర్ (Sphere) డిజైన్‌పై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.అత్యంత ఎత్తులో నిర్మించనున్న ఈ టవర్‌ను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించేలా డిజైన్ చేయడం, నిర్మాణ విధానాలకు సంబంధించిన అంశాలను సమావేశంలో పరిశీలించారు.అసెంబ్లీ భవనం పైన నిర్మించే ఈ టవర్ ద్వారా అమరావతి రాజధాని ప్రాంతాన్ని వీక్షించేలా టూరిస్ట్ ప్రాంతంగా రూపొందించే అంశంపై కూడా చర్చ జరిగింది.

**టవర్ నిర్మాణంపై ఎల్ అండ్ టీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

అసెంబ్లీ భవనం పైభాగంలో నిర్మించనున్న టవర్ నిర్మాణానికి సంబంధించి ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. టవర్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలను ప్రజెంటేషన్‌లో వివరించారు.

**ఐకానిక్ భవనాల ఫసాడ్ డిజైన్లపై చర్చ**

అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్ల వెలుపలి డిజైన్లపై కూడా సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్న తీరుకు అనుగుణంగా డిజైన్ల విషయంలో అవసరమైన సూచనలను ఎప్పటికప్పుడు చేయడం, నిర్మాణ దశలను బట్టి డిజైన్లకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ ప్రతినిధులతో మంత్రి చర్చించారు. అమరావతి ఐకానిక్ భవనాల నిర్మాణాలు జరుగుతున్న తీరుపై సమావేశంలో సమీక్షించారు. ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ ప్రక్రియతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన నిర్మాణ దశలపై ఆర్కిటెక్ట్‌లు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో మంత్రి నారాయణ చర్చించారు.మంత్రి నారాయణ వెంట సీఆర్డీయే కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, చీఫ్ ఇంజినీర్లు లండన్ పర్యటనలో పాల్గొన్నారు.

# భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి.



**- ఏపీ ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకుల డిమాండ్....**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10, అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం డివిజన్ పరిధిలో భూ సమస్యలు, రెవెన్యూ రికార్డుల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశిగాళ్ళ వెంకటేష్ మాట్లాడుతూ.... చెన్నేకొత్తపల్లి సర్వే నంబర్ 263బి2లోని 3 సెంట్ల స్థలానికి సంబంధించి నకిలీ పొజిషన్ సర్టిఫికెట్, అనంతరం దానపత్రం రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో సీకేపల్లి వీఆర్వో నారాయణస్వామితో పాటు సంబంధిత అధికారుల పాత్రపై విచారణ జరిపి, తప్పులు రుజువైతే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ధర్మవరం వైఎస్సార్ కాలనీలో శ్రీరాములు తన స్థలంలో నిర్మించుకున్న పునాదిని పక్క స్థలానికి చెందిన వ్యక్తి ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై క్షేత్రస్థాయి విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూ సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తమ పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు నారాయణస్వామి, ఆదినారాయణ, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు వనమాల ఆనంద్, గణేష్, ప్రదీప్, కళ్యాణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ పర్యాటక పటంలో ఆంధ్రప్రదేశ్



**న్యూఢిల్లీలో జరిగిన ఐఏటీఓ సమావేశంలో ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి గ్లోబల్ టూర్ ఆపరేటర్లు భాగస్వాములు కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపు**

**న్యూఢిల్లీ,ఆగస్టు 10, అనంత జనశక్తి ప్రతినిధి**

దేశంలోనే అత్యంత వైవిధ్యమైన పర్యాటక ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలుస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు, రాష్ట్రాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్(ఐఏటీవో), ట్రావెల్ ట్రేడ్ భాగస్వాములు, హోటల్ రంగానికి చెందిన ప్రముఖులతో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సోమవారం న్యూఢిల్లీలోని తాజ్ అంబాసిడర్ హోటల్ లో ఒక ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం మరియు విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నాయని, అధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక, తీరప్రాంత, ప్రకృతి, వెల్నెస్, క్రూయిజ్ టూరిజం విరాజిల్లుతోందన్నారు. కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధిని వివరిస్తూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టుబడిదారుల అనుకూల పర్యాటక విధానాలు, మెరుగైన రవాణా వసతులను ఉపయోగించుకొని రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల సంఖ్య, వారి బస సమయం మరియు ఖర్చును పెంచేలా వినూత్న టూర్ ప్లాన్లు, డెస్టినేషన్ ఆధారిత, అనుభవపూర్వక, సర్క్యూట్ ఆధారిత పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దేశ విదేశీ టూర్ ఆపరేటర్లను మంత్రి దుర్గేష్ ఆహ్వానించారు. ట్రావెల్ రంగానికి చెందిన భాగస్వాములతో బలమైన సంబంధాలు అవసరమని పేర్కొన్నారు. డెస్టినేషన్ ఫెమిలియరైజేషన్ విజిట్లు, ప్రచార మద్దతు, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మరియు ఇతర భాగస్వాముల సదుపాయాల కల్పన ద్వారా టూర్ ఆపరేటర్లకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**గోదావరి పుష్కరాలు 2027 - అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం:**

ఈ భేటీలో ప్రత్యేకించి 2027 జూన్ 26 నుండి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలు గురించి సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ ఉత్సవాన్ని కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంగానే కాకుండా గోదావరి తీరప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, హస్తకళలు, ఆహార సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో ఉన్న వందలాది ఘాట్లలో నిర్వహించే ఈ పుష్కరాలు పర్యాటక మరియు హోటల్ రంగ వ్యాపారాలకు సరికొత్త అవకాశాలను తెచ్చిపెడతాయని పేర్కొన్నారు.గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక సర్క్యూట్లు, పంచారామ క్షేత్రాల దర్శనం, రివర్ క్రూయిజ్ అనుభవాలు, విలేజ్ అండ్ నేచర్ టూరిజం,జిఐ ఉత్పత్తుల పర్యటనలు, గ్రామీణ, ప్రకృతి ఆధారిత పర్యాటకం వంటి ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించాలని టూర్ ఆపరేటర్లను మంత్రి దుర్గేష్ కోరారు. పుష్కరాల కోసం ఘాట్ల అభివృద్ధి, వసతి సౌకర్యాల పెంపు, రివర్ ఫ్రంట్ అందాలను తీర్చిదిద్దడం, డిజిటల్ సేవలు, మౌలిక వసతుల కల్పన, సమగ్ర ప్రచార కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు.ట్రావెల్ ట్రేడ్‌తో సుదీర్ఘకాల భాగస్వామ్యాన్ని నిర్మించుకోవడానికి ఏపీ పర్యాటక శాఖ కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా పరిచయం చేసేందుకు ఐఏటీఓ సభ్యులు కలసిరావాలని కోరారు. టూర్ ఆపరేటర్లు, ఇతర భాగస్వాముల మద్దతుతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, గోదావరి పుష్కరాలు 2027ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒక చారిత్రక పర్యాటక, సాంస్కృతిక ఉత్సవంగా తీర్చిదిద్దగలమని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.

**సెప్టెంబర్ లో విశాఖపట్నంలో ఐఏటీఓ వార్షిక సదస్సు:**

ట్రావెల్ రంగానికి చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా ఏపీ పర్యాటక శాఖ, ఐఏటీవో సంయుక్తంగా 2026 సెప్టెంబరు 10 నుండి 13 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తోన్న ఐఏటీఓ (IATO) వార్షిక సదస్సుకు రావాలని మంత్రి దుర్గేష్ టూర్ ఆపరేటర్లకు ఆహ్వానం పలికారు.. ఈ సదస్సు ద్వారా దేశ విదేశాల నుండి వచ్చే పర్యాటక నిపుణులు ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక అవకాశాలను ప్రత్యక్షంగా పరిశీలించి, భాగస్వామ్య ఒప్పందాలు చేసుకునేందుకు మంచి వేదిక లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగ అభివృద్ధికి ప్రైవేట్ భాగస్వాములు మరియు టూర్ ఆపరేటర్లకు కూటమి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం, ప్రచార మద్దతు అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు.అనంతరం పాత్రికేయులతో జరిగిన సమావేశంలో ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పర్యాటక రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులకు సంబంధించిన పలు ప్రశ్నలకు మంత్రి దుర్గేష్ వివరణాత్మక సమాధానాలు ఇచ్చారు.సమావేశంలో ఐఏటీవో ప్రతినిధులు రవి గోసేన్, రాజ్ నిష్ కైస్త్రా, రాజీవ్ మెహ్రా, సంజయ్ రజ్దన్, సునీల్ మిశ్రా, దీపక్ భట్నాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై వచ్చే వినతులను త్వరితగతిన పరిష్కరించాలి



**- అధికారులకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశం**

**బనగానపల్లి ఆగస్టు 10, అనంత జనశక్తి న్యూస్**

ప్రజల నుంచి వచ్చిన వినతులను చిత్తశుద్ధితో పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను రాష్ట్ర రోడ్లు & భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. నేటి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇవ్వడం జరిగింది. అలాగే చట్టబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో మంత్రి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్ లో మాట్లాడి ఆయా సమస్యలకు పరిష్కరించడం జరిగింది. క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనపై వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించడం జరిగింది.. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో బాధితుల నుంచి సర్వత్రా సంతోషం వ్యక్తమైంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

# మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ




**- సీబీఐ విచారణ జరపాలి : రంగయ్య ఉమా**

**కళ్యాణదుర్గం ఆగస్ట్ 10 జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వహించిన డీఎస్సీ మెగా కాదు దగ అని సమన్వయకర్త తలారి రంగయ్య మాదినేని ఉమామహేశ్వర నాయుడు మండిపడ్డారు. సోమవారం నిర్వహించిన భారీ ర్యాలీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఆర్డిఓ ఆఫీస్ వరకు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త తలారి రంగయ్యఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు పాల్గొన్నారు.అనంతరం కళ్యాణదుర్గం ఆర్.డి.ఓ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర నాయుడు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం, డీఎస్సీ నిర్వహణలో పూర్తిస్థాయి పారదర్శకతను పాటించడంలో విఫలమైందని విమర్శించారు.ప్రభుత్వం దీనిని మెగా డీఎస్సీగా ప్రచారం చేస్తున్నప్పటికీ, అభ్యర్థులు ఎదుర్కొంటున్న పరిస్థితులను చూస్తే ఇది మెగా డీఎస్సీ కాదని, "దగా డీఎస్సీ"గా మారిందని ఆయన మండిపడ్డారు.నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడే విధంగా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు. డీఎస్సీలో జరిగిన అవుకుతావకలపై స్వతంత్ర సంస్థ అయిన సీబీఐతో విచారణ జరిపించాలని దీనికి బాధ్యులైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిజానిజాలు వెలుగులోకి తీసుకువచ్చి, అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వరి జయంతిని విజయవంతం చేయండి



**- ఆలయ ధర్మకర్త పొట్ట పురుషోత్తం రెడ్డి పిలుపు**

**ఆమడగూరు ఆగస్టు 10: అనంత.జనశక్తి. న్యూస్.**

ఆమడగూరు స్థానిక శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలను బుధవారం నాడు అంగరంగ వైభవంగా జరిపిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమ్ రెడ్డి ప్రచార రథం నుండి పిలుపునిచ్చారు ప్రచార రథం మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటిస్తూ బుధవారం నాడు జరిగే శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి వేడుకలకు మండలంలోని ఇతర మండలాల్లోన భక్తతుహదలు భారీగా తరలివచ్చి జయంతి వేడుకలను దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు జయంతి వేడుకలు సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు హోమాలు తీర్థ అన్నప్రసాదాలు భక్తాదులకు అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు

# ఘనంగా ఎమ్మెల్యే దగ్గుపాటి జన్మదిన వేడుకలు

**- 50డివిజన్లు, 4పంచాయతీల్లో భారీ స్థాయిలో వేడుకలు**
**- అన్నదానం, రక్తదానం, ఆలయాల్లో ప్రత్యేక పూజలు**
**- కేక్ కటింగ్ లు, 3అన్న క్యాంటీన్లలో 3పూటలా ఉచిత భోజనం**
**- జై దగ్గుపాటి నినాదాలతో మారు మ్రోగించిన కార్యకర్తలు, అభిమానులు**

**అనంతపురం ఆగస్ట్ 10, అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన వేడుకల్ని పార్టీ శ్రేణులు భారీ స్థాయిలో నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు శుభాకాంక్షలు చెబుతూ.. నగరమంతటా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రాంనగర్ 80ఫీట్ రోడ్డు నుంచి పాటు అర్బన్ టీడీపీ కార్యాలయం వరకు అంతటా సందడి వాతావరణం కనిపించింది. నగరంలోని 50డివిజన్లు, 4పంచాయతీల్లోను పార్టీ కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ముందుగా పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ ను కట్ చేశారు. అనంతరం దగ్గుపాటి ఫౌండేషన్ తరుపున నగరంలోని మూడు అన్న క్యాంటీన్లలో మూడు పూటలా ఉచితంగా భోజనం అందించారు. టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్ లు అన్న క్యాంటీన్ లలో భోజనం వడ్డించారు. అలాగే నగరంలోని అన్ని ఆలయాల్లో దగ్గుపాటి ప్రసాద్ పేరు మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోర్ట్ రోడ్డు లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో టీడీపీ నాయకుడు కేశవ నాయుడు 101 టెంకాయలు కొట్టారు. సరిపూటి రమణ ఆధ్వర్యంలో జీసస్ నగర్ లో కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి 101 టెంకాయలు కొట్టారు. కొవ్వూరు నగర్ లోని వెంకటేశ్వర దేవాలయంలో టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి, వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర నాయకుడు మణిరవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్లస్టర్ ఇన్ ఛార్జ్ కాయగూరుల శ్రీధర్ ఆధ్వర్యంలో పాత ఊర్లోని రెడ్ క్రాస్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ ఆర్టీసీ గౌరవ అధ్యక్షుడు, టిడిపి నాయకుడు మున్నా నగర్ రమేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అరవింద్ నగర్ లోని వృద్ధాశ్రమం నందు దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళ వారి కాలనీ నందు చీరలు పంపిణీ చేశారు. క్లస్టర్ ఇంచార్జ్ డిష్ నాగరాజు ఆధ్వర్యంలో నారాయణపురంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఓంకార్ రెడ్డి ఆధ్వర్యంలో గౌటుకూరు లోని బెరాకా ఆశ్రమం నందు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్లస్టర్ ఇంచార్జ్ వన్నూరప్ప ఆధ్వర్యంలో బ్లైండ్ హాస్టల్ నందు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. మాజీ నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పాఠశాలలో చిన్న పిల్లలకు పుస్తకాలను అందించారు. రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధాశ్రమాలలో, అనాధాశ్రమాలలో కేక్ కటింగ్ లు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఎటు చూసినా జై దగ్గుపాటి అన్న నినాదాలతో మారుమ్రోగించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటితో తమకు రెండున్నర సంవత్సరాల పరిచయమే అయినప్పటికీ ఎంతో ఆప్తుడిగా మారారన్నారు. ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ఆయన చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో ఒక ప్రత్యేక అభిమానం సంపాదించుకున్నారన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆయన ముందుగా స్పందిస్తుంటారన్నారు. ఆయన నాయకత్వంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు. అలాగే పార్టీ కూడా మరింత బలోపేతం అవుతుందన్నారు.

# మిగిలిన వారికి... వారంలోగా 'నేతన్న సేవలో'

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత
- కొత్త దరఖాస్తులు 13,678 రాక
- అర్హులను గుర్తించి రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తాం
- 71,536 మందికి ఇప్పటికే ఆర్థిక సాయం చెల్లింపు
- నేతన్నలకు ఆర్థిక మేలు కలిగించాలన్నదే కూటమి లక్ష్యం : మంత్రి సవిత
- చేనేత, జౌళి శాఖాధికారులతో సమీక్ష
- అర్హులైన నేతన్నలకు 'నేతన్న సేవలో' ఇవ్వాల్సిందే..
- ఆర్థిక సాయం అందలేదన్న ఫిర్యాదు రాకూడదు
- మంత్రి సవిత ఆదేశం



**అమరావతి ఆగస్టు 10, అనంత జనశక్తి న్యూస్**

అర్హులైన నేతన్నలందరికీ నేతన్నల సేవలో పథకం కింద ఆర్థిక సహాయమందిస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటిలో అర్హులను గుర్తించి, వారం రోజుల్లోగా రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రాష్ట్ర సచివాయంలోని తన ఛాంబర్ లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేతన్నలందరూ గౌరవ ప్రదమైన జీవనం సాగించాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా చేనేత రంగ అభివృద్ధికి కార్యక్రమాలు చేపడుతూనే, నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగించేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేతలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు రూ.నాలుగు వేల చొప్పున పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినవిధంగా చేనేతలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. 62,541 మందికి నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం కింద 200 యూనిట్లు, 500 యూనిట్లు అందజేస్తున్నామన్నారు. చేనేత కుటుంబాలకు మరింత ఆర్థిక మేలు కలుగజేయాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల నేతన్నల సేవలో పథకాన్నికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా 71,536 మందికి రూ.25 వేల చొప్పున్న ఆర్థిక సాయం అందించామన్నారు. అర్హులు ఇంకా ఉన్నారన్న ఉద్దేశంతో దరఖాస్తులు కూడా స్వీకరించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,678 మంది నేతన్నల సేవలో పథకానికి దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వారిలో అర్హులను గుర్తించి వారం రోజుల్లోగా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని మంత్రి సవిత తెలిపారు.

**ఆర్థిక సాయం అందలేదనే ఫిర్యాదు రాకూడదు...**

అంతకుముందు చేనేత, జౌళి శాఖాధికారులతో మంత్రి సవిత తన ఛాంబర్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. చేనేతలకు ఆర్థిక దన్ను కల్పించాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేతన్న సేవలో పథకాన్ని అర్హులకు అందజేయాలన్నారు. ఈ పథకం కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హులను గుర్తించాలన్నారు. వారందరికీ ప్రభుత్వం అందజేసే పథకం కింద లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు. తమకు ఆర్థిక సాయం అందలేదనే ఫిర్యాదులుగాని, దరఖాస్తులగాని మరోసారి రాకూడదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లక్ష్య సాధనకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని స్పష్టంచేశారు. ఈ సమీక్షా సమావేశంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు, వర్చువల్ గా ఆయా జిల్లాలకు చెందిన ఏడీలు పాల్గొన్నారు.

# వైసీపీ నిరాధార ఆరోపణలు మానుకోవాలి

- కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు సరికాదు.. ఆధారాలుంటే అసెంబ్లీలో నిరూపించాలి
- వడ్డే సిమెంట్ పోలన్న

**అనంతపురం, ఆగస్టు 10 : అనంత జనశక్తి న్యూస్**




కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్డే సిమెంట్ పోలన్న తీవ్రంగా ఖండించారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన వైసీపీ ఉనికిని కాపాడుకునేందుకే ప్రభుత్వంపై ఏదో ఒక రకంగా బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈ సందర్భంగా పోలన్న మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టిందని, అర్హత, ప్రతిభ ఆధారంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందని తెలిపారు. ఈ నియామక ప్రక్రియను ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తి చేసి అభ్యర్థులకు నియమకాలు చేశారన్నారు. ఆధారాలు లేని ఆరోపణలతో రోడ్డుపై ధర్నాలు, నిరసనలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. నిజంగా మీ దగ్గర ఆధారాలుంటే బయట పెట్టండి.. అసెంబ్లీలో మాట్లాడండి.. విచారణ కోరండి. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ రాజకీయ డ్రామాలు చేయడం మానుకోండి" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనపై దృష్టి సారించిందని పోలన్న తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 16 వేల కుపైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసిందని పలు వార్తా నివేదికలు కూడా పేర్కొంటున్నాయి. "వైసీపీ నేతలు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి. ప్రజలను తప్పుదోవ పట్టించే నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారు. రాజకీయ విమర్శలకు మేము సిద్ధమే.. కానీ యువత భవిష్యత్తుతో ఆటలాడితే మాత్రం చూస్తూ ఊరుకోబోం" అని వడ్డే సిమెంట్ పోలన్న స్పష్టం చేశారు.

# జిల్లాకు కెనాల్స్ ద్వారా వచ్చే నీటిని త్రాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలి

- వ్యవసాయానికి ఉపయోగించరాదు
- ఐ గాట్ కర్మయోగి కోర్సులు ప్రతి ఉద్యోగి పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

**అనంతపురం, ఆగస్టు 10:అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం జిల్లాకు వివిధ కెనాల్స్ ద్వారా వచ్చే నీటిని నీటిని త్రాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని, వ్యవసాయానికి ఉపయోగించరాదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు.సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు హెచ్.ఎన్.ఎస్.ఎస్, హెచ్.ఎల్.సి వంటి వివిధ కెనాల్స్ ద్వారా వచ్చే నీటిని కేవలం త్రాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని, వ్యవసాయానికి వాడరాదన్నారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు నీరు త్రాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించేటట్లు పర్యవేక్షణ చేయాలన్నారు.జిల్లాలో పంట వేసిన ప్రతి రైతు ఈపంట నమోదు చేసుకునే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన విశాఖ అధికారులు రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈపంట నమోదు చేసుకోకపోతే వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు వేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందదన్నారు. జిల్లాలోని ప్రతి రైతు 100 శాతం ఈ పంట నమోదు చేసుకునే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు చూడాలన్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజలు ఇచ్చే అర్జీలు ఎప్పటికప్పుడు నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీలు ఎట్టి పరిస్థితులలో బియాండ్ ఎస్ఎల్ఏలోకి పోకూడదన్నారు. ఐ గాట్ కర్మయోగి కార్యక్రమానికి సంబంధించి ప్రతి శాఖలో పనిచేసే ఉద్యోగి నెలకు మూడు కోర్సులు చొప్పున పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి శాఖకు ఐ గాట్ కర్మయోగి కార్యక్రమం గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండేటట్లు సంబంధిత హెచ్వోడీలు చూడాలని సిపిఓకు సూచించారు. ఇందులో ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్లు, మండల విద్యాశాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ తదితర శాఖలన్నీ తమ సిబ్బందితో ఐగాట్ కర్మయోగి కోర్సులు పూర్తి చేయించేటట్లు చూడాలని సిపిఓకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులకు కూలంకుశంగా వివరించి దిశా నిర్దేశం చేశారు.

# ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమిస్తాం

- అవసరమైతే అసెంబ్లీ ముట్టడి చేస్తాం
- డీఎస్సీపై మండలిలో చర్చించడానికి ధైర్యం లేదా?
- డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరగాలి
- స్పోర్ట్స్ కోటాలో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
- శాంతియుత ర్యాలీలను అడ్డుకోవడం దుర్మార్గం
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపాటు
- డీఎస్సీ అక్రమాలపై అనంతపురంలో కదంతొక్కిన శ్రేణులు

**అనంతపురం, ఆగస్టు 10 :అనంత జనశక్తి న్యూస్**



డీఎస్సీ నియామకాలకు సంబంధించి స్పోర్ట్స్ కోటాలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారని, దీనిపై తక్షణం సీబీఐ విచారణ చేయించాలని వైఎస్ఆర్సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమాలు చేస్తామని, అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. డీఎస్సీ-2025లో అక్రమాలపై సోమవారం అనంతపురంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పవర్ ఆఫీస్ నుంచి పాతూరులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు పార్టీ శ్రేణులు కదంతొక్కాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ నియామకాలను అవినీతిమయం చేశారన్నారు. పేపర్ లీకేజ్ తో పాటు స్పోర్ట్స్ కోటాకు సంబంధించి కూడా జీవోలు మార్చారని తెలిపారు. స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి ఎందుకు మార్చారని ప్రశ్నించారు. కావాల్సిన వాళ్లకు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఇచ్చుకుని ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై తక్షణం సీబీఐ విచారణతో పాటు నైతిక బాధ్యతగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీకి సంబంధించి అసెంబ్లీలో చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలు చెబుతున్నారని.. శాసన మండలిలో చర్చించే ధైర్యం లేదా? అని అన్నారు. డీఎస్సీ అక్రమాలతో పాటు ఫీజురీయింబర్స్మెంట్ బకాయిలు రూ.9500 కోట్లు చెల్లించాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లతో ఇప్పటికే కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసి నియోజకవర్గ స్థాయిలో రిలే నిరాహార దీక్షలు కూడా చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు చేపడుతుంటే విజయవాడ, పులివెందుల, గుంటూరు, కడప జిల్లాతో పాటు తాడిపత్రిలో నిరసనలు తెలియజేయడానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాడిపత్రికి వెళ్తుంటే అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలో తన ఇంట్లో నుంచి బయటకు రాకుండా చేశారన్నారు. ఈ ప్రభుత్వానికి కాలం దగ్గరపడిందని హెచ్చరించారు. డీఎస్సీలో కోచింగ్ సెంటర్లు పెట్టుకున్న వాళ్లకు, పరీక్ష ప్రక్రియలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా ఉన్న వ్యక్తికి ఫస్ట్ ర్యాంకులు వచ్చాయన్నారు. తక్షణం స్పోర్ట్స్ కోటాకు సంబంధించి వివరాలన్నీ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగుల ఆశలను చంద్రబాబు ప్రభుత్వం చిదిమేసిందని తెలిపారు. విద్యార్థి, యువత, నిరుద్యోగులు, డీఎస్సీలో అన్యాయానికి గురైన వారి తరపున పోరాడుతుంటే రెడ్‌బుక్ రాజ్యాంగంతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. యువత రోడ్డు మీదకు వచ్చి ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోవడం లేదని, భవిష్యత్‌లో ఉద్యమాలు తీవ్రంగా ఉంటామని హెచ్చరించారు. డీఎస్సీలో అన్యాయానికి గురైన అభ్యర్థులతో పాటు యువత, విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలు చేస్తామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులను రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్ అంటూ అధికార పార్టీ నేతలు అవహేళగా మాట్లాడుతున్నారని, భవిష్యత్‌లో యువత సత్తా ఏమిటో తెలియజేస్తామన్నారు.

# కోడిపందాలపై పోలీసుల దాడి ఐదుగురు వ్యక్తుల అరెస్ట్



- రూ,11,500. నగదు స్వాధీనం..

**తలుపుల ఆగస్టు10(అనంత జనశక్తి న్యూస్):-**

మండల పరిధిలోని రెడ్డి మూలపల్లి గ్రామ పొలిమేరల్లో కోడిపందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు..
ఎస్సై చెన్నయ్య తమ పోలీస్ సిబ్బందితో దాడి నిర్వహించారు.ఈ దాడిలో కోడిపందాలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 5 పందెం కోళ్లు మరియు రూ.11,500/ నగదు స్వాధీనం చేసుకున్నారు.కోడిపందాలు నిర్వహించడం, బెట్టింగ్‌లకు పాల్పడడం చట్టవిరుద్ధమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు ఈ దాడిలో పాల్గొన్న పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం



- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం ,ఆగస్టు 10:అనంత జనశక్తి న్యూస్**

ప్రతిఒక్కరూమాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించడంలో సామాజిక కర్తవ్యంగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్
ఓ .ఆనంద్ పిలుపు నిచ్చారు. సోమవారం ఉదయం అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో" నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ (వికసిద్భారత్ కోసం వ్యసన రహిత యువత) కార్యక్రమంలో భాగంగా బ్రహ్మకుమారిస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల లో నిర్వహించిన అవగాహన చైతన్య కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు బ్రహ్మకుమారిస్ నిర్వహించిన 10 కోట్ల వ్యసన రహిత సామూహిక ప్రతిజ్ఞ ఉద్యమంలో పాల్గొనడం తనకేంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా నేటి యువత వ్యసనాలకు బానిసలై తన విలువైన సమయాన్ని వృధా చేస్తూ ప్రాణాంతక అనారోగ్య కారణాలవల్ల నష్టపోతున్నారని జిల్లా కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావంతులైన యువత చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ప్రజాహిత ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, బ్రహ్మకుమారీస్ ఈశ్వరి సంస్థ ప్రతినిధి సిస్టర్ శారద ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీరాములు, నాగభూషణం సూగప్ప తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చుకోట వద్ద పెద్దిరెడ్డి, అనంత ఆందోళన

- తాడిపత్రికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- అరెస్ట్, అనంతపురం తరలింపు
- ఇలాగే వ్యవహరిస్తే డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

**అనంతపురం, ఆగస్టు 10 : అనంత జనశక్తి న్యూస్**

తాడిపత్రిలో డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన నిరసన ర్యాలీకి వెళ్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని ముచ్చుకోట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తాడిపత్రిలో కేవలం శాంతియుత ర్యాలీ చేయడానికి మాత్రమే వెళ్తున్నామని, తమను అనుమతించాలని కోరినా పోలీసులు వినలేదు. శాంతిభద్రతలను సాకుగా చూపి చివరకు వారిని అరెస్ట్ చేసి అనంతపురం తరలించారు. ఈ క్రమంలో పోలీసుల తీరుపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? లేదా? అని పెద్దిరెడ్డి ఆగ్రహించారు. డీఎస్సీ నిర్వహణపై 35 వేల ఫిర్యాదులు ఎందుకొచ్చాయన్నారు. డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా చేస్తున్న వైఎస్ఆర్సీపీ ర్యాలీలను అడ్డుకోవడం దుర్మార్గమని విమర్శించారు. మంత్రి లోకేష్ కనుసన్నల్లోనే డీఎస్సీలో అక్రమాలు జరిగాయని తెలిపారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలను 15 లక్షల నుంచి 20 లక్షలకు అమ్ముకున్నారని అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. ఇప్పటికే సాక్ష్యాలతో అన్ని జిల్లాల కలెక్టర్లకు అందజేశామని చెప్పారు. డీఎస్సీ అక్రమాలతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తాడిపత్రిలో ఏ కార్యక్రమం చేయాలన్నా పోలీసులతో అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఇలాగే వ్యవహరిస్తే విజయవాడలో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు.





# భారత్‌కు జపాన్ మహిళ

## భర్త చివరి కోరికను తీర్చేందుకు..

- సరయూ నదిలో అస్థికలు నిమజ్జనం
- బాగేశ్వర్ పట్టణంలోని ప్రశాంతతకు ముగ్దుడు
- హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారం

న్యూఢిల్లీ, ఆగస్ట్ 10, అనంత జనశక్తి న్యూస్

హిందూ సంప్రదాయం ప్రకారం తనకు అంత్యక్రియలు నిర్వహించి, అస్థికలను భారత్‌లోని పవిత్ర నదిలో నిమజ్జనం చేయాలన్న భర్త చివరి కోరికను నెరవేర్చడానికి ఒక జపాన్ మహిళ వేల కిలోమీటర్లు ప్రయాణించింది. ఉత్తరాఖండ్‌లోని బాఘేశ్వర్‌కు చేరుకున్న ఆమె.. తన భర్త అస్థికలను పవిత్ర సరయూ నదిలో నిమజ్జనం చేసి, ఆయన కోరికను ఘనంగా నెరవేర్చింది. జపాన్‌కు చెందిన మియాకో అనే మహిళ, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలపై గాఢమైన ఆసక్తిని పెంచుకున్న అమెరికాలో జన్మించిన తన భర్త రాబర్ట్ అవశేషాలను తీసుకుని బాఘేశ్వర్‌కు చేరుకున్నారు.
తన జీవిత కాలంలో రాబర్ట్.. తన అంత్యక్రియలు మరియు అస్థికల నిమజ్జనం (హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాల అవశేషాలను పవిత్ర నదిలో కలపడం) ఉత్తరాఖండ్‌లోని బాఘేశ్వర్ ఉన్న బాగ్నాథ్ ధామ్‌లో జరగాలని కోరుకున్నారు. స్థానిక గైడ్లు, పురోహితుల సహాయంతో మియాకో బాఘేశ్వర్‌లోని సరయూ, గోమతి నదుల సంగమ ప్రాంతానికి చేరుకున్నారు. రాబర్ట్ ఆత్మ శాంతి కోసం స్థానిక పూజారుల సహాయంతో నదీతీరంలో సాంప్రదాయ వైదిక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన అస్థికలను సరయూ నదిలో నిమజ్జనం చేశారు.
భారతీయ సంస్కృతి, హిందూ సంప్రదాయాలు, ఆధ్యాత్మికతపై రాబర్ట్‌కు ఎంతో గౌరవం ఉందని, తన చివరి కోరికను ఆయన భార్యకు స్పష్టంగా తెలియజేశారని మియాకోకు సహకరించిన స్థానిక గైడ్ తెలిపారు. భర్త ఎంతగానో గౌరవించే సంప్రదాయాల ప్రకారం ఆయన చివరి కోరిక నెరవేరేలా చూడటానికే మియాకో జపాన్ నుంచి బాఘేశ్వర్‌కు వచ్చినట్లు వెల్లడించారు. ఘాట్‌ల వద్ద ఉన్న స్థానికులు, తీర్థయాత్రలకు వచ్చిన భక్తులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. భర్త చివరి కోరికను గౌరవించడానికి జపాన్ నుంచి ఉత్తరాఖండ్‌కు వచ్చిన మియాకో నిర్ణయాన్ని పలువురు ప్రశంసించారు.
శివునికి అంకితం చేసిన పురాతన బాఘేశ్వర్‌లోని ముఖ్యమైన ఆధ్యాత్మిక కేంద్రాలలో ఒకటైన బాగ్నాథ్ ఆలయం సమీపంలో ఈ కార్యక్రమం జరిగింది. సరయూ, గోమతి నదుల సంగమ స్థానంలో ఉన్న బాఘేశ్వర్, ఉత్తరాఖండ్‌లో ఒక ముఖ్యమైన పుణ్యక్షేత్రంగా ఉంది. ఈ పట్టణం పూర్వీకుల ఆచారాలు, పవిత్ర జలాల్లో అస్థికల నిమజ్జనానికి కూడా ప్రసిద్ధి చెందింది.
ఇదిలా ఉండగా, 2005లో రాబర్ట్, మియాకోలు ఓ యోగా శిక్షలో కలుసుకున్నారు. ఆ పరిచయం స్నేహానికి దారితీసి, ప్రేమగా మారింది. ఇరువురూ కలిసి 2007లో తొలిసారి భాగేశ్వర్‌ను సందర్శించారు. సరయూ, గోమతి నదుల సంగమ ప్రదేశం ఉన్న ఆ పట్టణంలో ప్రకృతి, ప్రశాంతత, ఆధ్యాత్మిక వాతావరణం రాబర్ట్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ జంట 2009లో వివాహం చేసుకుని, జపాన్‌లో స్థిరపడింది. రాబర్ట్ అక్కడ ఓ యూనివర్సిటీలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా చేరాడు. కానీ, విధి ఈ జంటను చిన్నచూపు చూసింది. 2022లో బ్రెయిన్ హెమరేజ్‌కు గురైన రాబర్ట్.. మృతిచెందాడు.

## సుప్రీంకోర్టులో అభిషేక్‌కు ఊరట

# మమతా బెనర్జీ మేనల్లుడు

- కలకత్తా హైకోర్టు ఆదేశాలు రద్దు
- కంటి చికిత్స కోసం విదేశాలకు వెళ్లేందుకు..
- కలకత్తా హైకోర్టు తిరస్కరణ.. సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ, ఆగస్ట్ 10, అనంత జనశక్తి న్యూస్

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ) ఎంపీ అభిషేక్ బెనర్జీకి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. కంటి చికిత్స కోసం విదేశాలకు వెళ్లేందుకు సర్వోన్నత న్యాయస్థానం సోమవారం అనుమతించింది. ''ప్రతి వ్యక్తికి విదేశాలకు వెళ్లే హక్కు ఉంది... ప్రతి వ్యక్తికి తన వైద్య చికిత్సను ఎంచుకునే హక్కు ఉంది. అది మీరు నిర్ణయించరాదు'' అని కోర్టు పేర్కొంది.కంటి చికిత్స కోసం బెనర్జీ సెప్టెంబర్‌లో విదేశాలకు వెళ్లేందుకు అనుమతించారు. అయితే, ప్రయాణ, విమాన వివరాలు, బస చేసే ప్రదేశం, చికిత్స పొందాలని ప్రతిపాదిస్తున్న వైద్యులు, ఆసుపత్రి వివరాలను అందించాలని కోర్టు ఆదేశించింది.
హైకోర్టు తిరస్కరణ
టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అయిన అభిషేక్ బెనర్జీ.. 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బెదిరింపులకు సంబంధించి కేసును ఎదుర్కొంటున్నారు. కంటి చికిత్స కోసం విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కలకత్తా హైకోర్టు ఆగస్టు 5న తిరస్కరించింది. భారత్‌లో అధునాతన వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, 40 ఏళ్ల వారు దేశం విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని జస్టిస్ సౌగత్ భట్టాచార్యతో కూడిన సింగిల్ బెంచ్ వ్యాఖ్యానించింది.
2016 జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటికి గాయం కావడంతో విదేశాల్లో చికిత్స చేయించుకోవాలని భావిస్తున్నారు. అభిషేక్ బెనర్జీ ఎక్కడ చికిత్స పొందుతున్నారనేది ముఖ్యం కాదని, వైద్య సహాయం పొందడం అత్యంత ముఖ్యమని జస్టిస్ భట్టాచార్య అన్నారు. దీనికి ముందు జులై 20న కూడా ఆయన అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. అభిషేక్ బెనర్జీ విదేశాలకు వెళ్లడానికి అనుమతిస్తే దేశం విడిచి పారిపోవచ్చని అధికార బీజేపీ ఆరోపించింది.

**బీజేపీ ఆరోపణలు**

పశ్చిమ బెంగాల్ మంత్రి, బీజేపీ సీనియర్ నేత అగ్నిమిత్ర పాల్ మాట్లాడుతూ.. తన వైద్య పరిస్థితిని దేశం విడిచి వెళ్లడానికి ఒక సాకుగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ''ఆయన (అభిషేక్)కు చికిత్స అవసరమైతే ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యుత్తమ వసతులు ఏర్పాటు చేయగలం... ఇక్కడ లక్షలాది మందికి చికిత్స అందుతుంది. దేశం నుంచి పారిపోవడానికి ఇదొక వ్యూహం కావచ్చు'' అని పాల్ పేర్కొన్నారు.

**రితబ్రత బెనర్జీ విమర్శలు**

అలాగే ప్రతిపక్ష నేత రితబ్రత బెనర్జీ సైతం.. చట్టాల నుంచి తప్పించుకోవడానికి టీఎంసీ (TMC) నేత తన డిప్లొమాటిక్ పాస్‌పోర్ట్‌ను దుర్వినియోగం చేయవచ్చని ఆరోపించారు. ''తప్పించుకోవాలనే ఉద్దేశంతో విదేశాలకు వెళ్లాలని తహతహలాడుతున్నాడు. డిప్లమాటిక్ పాస్‌పోర్ట్ ఉన్న ఎవరైనా భారత్‌తో నేరస్థులను అప్పగించే ఒప్పందం లేని దేశానికి చేరుకున్న తర్వాత, అతడ్ని తిరిగి తీసుకురావడం కష్టమవుతుంది'' అని పేర్కొన్నారు. పశ్చిమ్ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోన్న సంగతి తెలిసిందే. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు తిరుగుబాటుచేసి తమదే అసలైన టీఎంసీ అని ప్రకటించుకున్నారు.



# వైసీపీ రాజకీయ హత్యలకు పాల్పడుతోంది

అమరావతి, ఆగస్ట్ 10, అనంత జనశక్తి న్యూస్



వైసీపీ నేతలపై ఏపీ మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ రాజకీయ హత్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. సోమవారం కర్నూలు జిల్లాలో మంత్రి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నూలు వైసీపీ రౌడీ మూకలు హత్యలు, హత్యాయత్నాలతో అరాచకాలు సృష్టిస్తున్నారని ఆగ్రహించారు.

**ఇంతియాజ్‌ను దారుణంగా హత్య చేశారు..**

పక్కా పథకం ప్రకారం టీడీపీ కార్యకర్త ఇంతియాజ్‌ను దారుణంగా హత్య చేశారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు గురైన ఆయన గడిచిన ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారని ప్రస్తావించారు. అప్పట్లో తన నామినేషన్ విత్ డ్రా చేసుకోవాలని వైసీపీ వర్గీయులు ఇంతియాజ్‌ను బెదిరించారని.. ఇంటికెళ్లి గొడవకు దిగారని తెలిపారు. ఆ తర్వాత ఆయన టీడీపీలో చేరారని వెల్లడించారు. హత్యకు గురైన ఇంతియాజ్ హంద్రీనదిలో వైసీపీ కబ్జాలను బయట పెట్టారని చెప్పుకొచ్చారు. ఆది మనసులో పెట్టుకుని ఇంతియాజ్‌ను దారుణంగా హత్య చేశారని మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
కర్నూలులో వైసీపీ రౌడీ మూకలు హత్యలు, హత్యాయత్నాలతో అరాచకాలు చేస్తున్నారని మంత్రి ధ్వజమెత్తారు. తనకు వచ్చిన సమాచారం కూడా పోలీసులకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు సీరియస్‌గా ఈ కేసును తీసుకోవాలని ఆదేశించారు. కర్నూల్‌లో పరిస్థితులు సీఎం చంద్రబాబును కలిసి వివరిస్తానని చెప్పారు. వైసీపీ ధోరణి ఇలాగే ఉంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గతంలో 1994 నుంచి 2004లో కర్నూలులో ఫ్యాక్షనిజాన్ని టీడీపీ సర్కార్‌లో అదుపులోకి తీసుకువచ్చామని ప్రస్తావించారు. మళ్లీ అలాంటి పరిస్థితులు తీసుకురావాల్సి వస్తుందని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

## పోలీసు బలప్రయోగానికి

# దిగడంపై గుస్సా



న్యూఢిల్లీ, ఆగస్ట్ 10, అనంత జనశక్తి న్యూస్

పార్లమెంటుకు విద్యార్థుల ర్యాలీ సందర్భంగా పోలీసు బలప్రయోగానికి దిగడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ ఉదంతంలో పాలకులు దోషులైనా లేదా అసమర్థులైనా అయ్యుండాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'పెలెట్ గన్నులు, ముళ్లు ఉన్న బాటన్స్, టియర్ గ్యాస్.. వీటితో విద్యార్థులపై దాడులు జరిగాయి. శాంతియుతంగా ప్రశ్నలు అడిగిన వారిపై దాడులు జరిగాయి. యువతులను కూడా పోలీసులు కొట్టారు. పలువురికి ఎముకలు విరిగాయి. ప్రశ్నలు అడిగిన వారితో మోదీ ప్రభుత్వం అనాగరికంగా వ్యవహరించింది'
'పార్లమెంటు సమావేశాలు 20 రోజులుగా జరుగుతున్నా హోం మంత్రి సభకు రాలేదు. విద్యార్థులపై బలప్రయోగంపై చర్చించేందుకు ప్రతిపక్షం ప్రవేశపెట్టిన ప్రతి తీర్మానం తిరస్కరణకు గురైంది. ఈ మౌనం నిర్లక్ష్యమో మరొకటో కాదు.. అక్కడ జరిగిన హింసకు ఆమోదం. వాళ్లు దోషులైనా అయ్యుండాలి లేదా అసమర్థులైనా అయ్యుండాలి. సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఈ ఉదంతంపై దర్యాప్తు జరగాలని మేము డిమాండ్ చేస్తున్నాము. అప్పటివరకూ మా పోరాటం ఆగదు' అని ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# మీ భూమి.. మీ హక్కు





(మొదటిపేజీ తరువాయి)

తెదేపాలోని ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఓటమి చెందే పరిస్థితి రాకూడదని చెప్పారు. ఏలూరు జిల్లా కలిదిండిలో కైకలూరు నియోజకవర్గ తెదేపా కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. 2029లో మళ్లీ గెలుస్తామా అనే అనుమానం ఉన్నవాళ్లను పక్కకు నెట్టాలన్నారు. త్వరలోనే కైకలూరుకు తెదేపా ఇన్‌ఛార్జ్‌ను నియమిస్తామని చెప్పారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ విధ్వంసాలు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. బలప్రదర్శనలతో ఓట్లు రావన్నారు.
''వచ్చే ఎన్నికల్లోనూ కూటమి గెలుపు తథ్యం. గతం కంటే అధికంగా 2029లో ఓట్లు వచ్చేలా కార్యకర్తలు సమర్థంగా పనిచేయాలి. ప్రతిపక్షంలో చురుగ్గా పనిచేసి అధికారంలోకి వచ్చాక నెమ్మదిస్తున్నారు. శాశ్వతంగా అధికారంలో ఉండాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలి. 2027లో పోలవరం పూర్తిచేసి కైకలూరుకు నీళ్లిస్తాం. అధికారుల కంటే కార్యకర్తలకే అధిక సమయం కేటాయిస్తా. ప్రభుత్వ పథకాల పంపిణీలో పార్టీ శ్రేణులు పాల్గొనట్లేదు. పింఛన్ల పంపిణీలో ప్రతి కార్యకర్తా పాల్గొని ప్రజలతో మమేకం కావాలి. యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. కూటమి పార్టీలతో కలిసి పనిచేయాలి. 2029లోనూ మూడు పార్టీలు కలిసి పనిచేస్తాయి. 175 నియోజకవర్గాల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తా. నాయకత్వ మార్పులు చేస్తాం.. ఎవరిని పెట్టినా పార్టీ శ్రేణులు స్వాగతించాలి. స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి.. గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'' అని చంద్రబాబు అన్నారు.

**సమస్యలు పరిష్కరిస్తేనే జనాలు జై కొడతారు: చంద్రబాబు**

ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఏకైక అజెండా అని సీఎం చంద్రబాబు అన్నారు. సుపరిపాలనే తమ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా కలిదిండిలో చంద్రబాబు పర్యటించారు. మీ భూమిమీ హక్కు కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.
''ప్రధాని మోదీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ సూపర్ స్పీడ్‌లో పరుగెడుతోంది. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ అధికారులు గట్టిగా పనిచేయాల్సిందే. పట్టాదారు పాస్ పుస్తకంపై వేరే వాళ్ల ఫొటో వేసుకుంటే ఊరుకుంటామా..?గత ప్రభుత్వ విధ్వంసం వల్ల అనేక సమస్యలు వచ్చాయి. భూసమస్యలపైనే ఎక్కువ అర్జీలు వచ్చాయి. ఎట్టి పరిస్థితుల్లో భూసమస్యలను పరిష్కరించాలని అనుకున్నాం.
సమస్యలు పరిష్కరిస్తేనే జనాలు జై కొడతారు. లేకపోతే చూశాం కదా.. 11కి పరిమితం చేశారు. బటన్ నొక్కడం, పరదాల చాటున రావడం, సభలు పెట్టి చెట్లు నరికేయటం గత పాలకులు చేశారు. కానీ మేం ప్రతీ నెలా ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే ఈ సమావేశాల ద్వారా ప్రజల్ని కలుస్తున్నాం. కరెన్సీ నోట్లకు ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉంది. ఏడు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తిచేస్తాం.

**రౌడీలకు సింహస్వప్నంగా ఉంటా**

ముఠా కక్షలు, రౌడీయిజాన్ని అణచివేశాం. రాయలసీమలో ముఠా కక్షలు రూపుమాపాం. రోడ్లపైకి వచ్చి విన్యాసాలు చేస్తే ఊరుకోవాలా?గొడ్డలి పార్టీకి అభివృద్ధి ముఖ్యం కాదు.. వారికి కావాల్సింది విధ్వంసమే. నేను రౌడీయిజం చేయను.. రౌడీలకు సింహస్వప్నంగా ఉంటా. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఎవరినీ వదలిపెట్టం. స్వర్ణాంధ్ర నిర్మాణానికి సంకల్పం చేశా. 'నేను' అనే సంకల్పానికి అందరూ సిద్ధం కండి. దానికి సహకారం అందించే బాధ్యత మాది. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. అభివృద్ధికి ఎవరు అడ్డొచ్చినా ఊరుకునేది లేదు'' అని చంద్రబాబు అన్నారు.

**సిగ్గులేకుండా వైకాపా నిరసనలు**

డీఎస్సీపై వైకాపా దుష్ప్రచారాలు భరించలేకే కర్నూలులో ఉపాధ్యాయులు కదంతొక్కారని సీఎం చంద్రబాబు అన్నారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియపై ఆ పార్టీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టారని చెప్పారు. టీచర్లు సవాల్ విసిరినా సిగ్గులేకుండా వైకాపా నిరసనలు చేస్తోందన్నారు.

# 650 అడుగుల ఎత్తులో త్రివర్ణ పతాకం

(మొదటిపేజీ తరువాయి)

దట్టమైన అటవీ ప్రాంతమైన కర్రెగుట్టలు .. ఒకప్పుడు మావోయిస్టులకు ప్రధాన స్థావరంగా ఉండేది. అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో ఒకటిగా పేరున్న ఈ కర్రెగుట్టల ప్రాంతంలో మావోయిస్టులు భారీగా మందుపాతరలు అమర్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. పోలీసు బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులతో ఈ కొండ ప్రాంతం ఎన్నో ఏళ్ల పాటు ఉద్రిక్తంగా ఉండేది. భద్రతా కారణాలతో ప్రభుత్వ అధికారులు సైతం ఈ ప్రాంతంలోకి వెళ్లడం కష్టంగా ఉండేది.
ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' తర్వాత పరిస్థితుల్లో గణనీయమైన మార్పువచ్చింది. పలువురు మావోయిస్టులు భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతి చెందగా.. మరికొందరు లొంగిపోయారు. దీంతో కర్రెగుట్ట ప్రాంతంలో భద్రతా బలగాలు పట్టు సాధించాయి. ఈ పరిణామాలు అక్కడ అభివృద్ధి పనులకు మార్గం సుగమం చేశాయి. కర్రెగుట్టల దిగువన ఉన్న పామునూరు ప్రాంతం నుంచి కొండపైకి నిర్మిస్తున్న రహదారి పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఈ రహదారిని సుమారు 20 కిలోమీటర్ల మేర ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా సరిహద్దు వరకు విస్తరించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తిగా అందుబాటులోకి రాకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ప్రయాణం ఇప్పటికీ కష్టతరంగానే ఉంది.
డీజీపీ సీవీ ఆనంద్ నేతృత్వంలో సీనియర్ పోలీసు అధికారులు, సీఆర్‌పీఎఫ్, ఇంటెలిజెన్స్, అటవీ శాఖల అధికారులు తొలిసారి రోడ్డు మార్గంలో కర్రెగుట్టలకు చేరుకున్నారు. గతంలో ఈ ప్రాంతాన్ని పరిశీలించేందుకు ఉన్నతాధికారులు హెలికాప్టర్లను ఆశ్రయించాల్సి వచ్చేది. ఇప్పుడు భద్రతా పరిస్థితులు మెరుగుపడటంతో అధికారులు వాహనాల కాన్వాయ్‌లోనే కొండ ప్రాంతానికి చేరుకోవడం కీలక పరిణామంగా మారింది.
అటవీ సంపదకు నష్టం కలగకుండా.. కర్రెగుట్టల ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. దీనివల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు.. ఆ ప్రాంత అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయడంతో పాటు అవసరమైన చోట్ల కల్వర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.
డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన సందర్భంగా కర్రెగుట్ట ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తెలంగాణకు చెందిన యాంటీ నక్సల్ కమాండోలు గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలు భద్రత కల్పించాయి. ఒకప్పుడు తుపాకీ కాల్పులతో మారుమోగిన కర్రెగుట్టల్లో ఇప్పుడు త్రివర్ణ పతాకం ఎగరడం.. అక్కడ చోటుచేసుకుంటున్న మార్పుకు ప్రతీకగా నిలిచిందని చెబుతున్నారు.







# బిజీగా ఉండే ఉద్యోగుల కోసం 4 డెస్క్ యోగా స్ట్రెచ్‌లు

ఆఫీసులో కూడా యోగాను ఎలా చేర్చుకోవచ్చో చూద్దాం. సాధారణంగా యోగా అంటే మ్యాట్‌లు, తోటల్లో చేసేదిగానే చాలామంది అనుకుంటారు. దీనివల్ల బిజీ షెడ్యూల్స్ ఉన్నవాళ్ళు యోగా చేయడానికి సమయం దొరకక ఇబ్బంది పడుతుంటారు. కానీ యోగా అనేది చాలా సరళమైనది, సులభంగా మార్చుకోదగినది. డెస్క్ యోగా స్ట్రెచ్‌లతో దీన్ని మన రోజువారీ ఆఫీసు పనిలో సులభంగా కలిపేసుకోవచ్చు. ఇలా చేస్తే, ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేసినా ఉత్సాహంగా, ఒత్తిడి లేకుండా ఉండొచ్చు. హిమాలయన్ సిద్ధా అక్షర్ యోగా కేంద్ర స్థాపకులు, యోగా నిపుణుడు హిమాలయన్ సిద్ధా అక్షర్ ఉద్యోగుల కోసం 4 డెస్క్ యోగా స్ట్రెచ్‌లను, వాటిని ఎలా చేయాలో స్టెప్ బై స్టెప్ వివరించారు.



1. గ్రీవ సంచాలన క్రియ (మెడ తిప్పడం):
ఎలా చేయాలి: డెస్క్ వద్ద కూర్చుని, వీపును నిటారుగా ఉంచండి. మెడను నెమ్మదిగా సవ్యదిశలో (క్లాక్‌వైజ్) తిప్పండి. పైకి వెళ్లేటప్పుడు శ్వాస తీసుకోండి. క్రిందకు వచ్చేటప్పుడు శ్వాస వదలండి. ఇలా 5-8 సార్లు చేయండి. తర్వాత అపసవ్యదిశలో (యాంటీ-క్లాక్‌వైజ్) మళ్ళీ చేయండి.
ప్రయోజనాలు: మెడ, భుజాలపై ఉన్న ఒత్తిడిని తగ్గిస్తుంది. మనసును స్థిమితంగా ఉంచుతుంది.

2. తాడాసనం:
ఎలా చేయాలి: డెస్క్ వర్క్ చేస్తున్నప్పుడు ప్రతి రెండు గంటలకు ఒకసారి లేచి నిలబడండి. చేతి వేళ్ళను ఒకదానితో ఒకటి కలిపి, చేతులను తల పైన పూర్తిగా పైకి చాచండి. మీ శరీర బరువును కాలివేళ్లపై ఉంచి, మొత్తం శరీరాన్ని సాగదీయండి. ఇలా 5 సార్లు చేయండి.
ప్రయోజనాలు: శరీరమంతా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. కండర వ్యవస్థకు తక్షణమే శక్తినిస్తుంది.



శరీరాన్ని తిరిగి సరైన స్థితికి తీసుకువస్తుంది.

3. పరివృత్త సుఖాసనం (ట్విస్టెడ్ ఈజీ పోజ్):
ఎలా చేయాలి: కుర్చీలో నిటారుగా, సౌకర్యవంతంగా కూర్చోండి. ఎడమ చేతిని కుడి మోకాలిపై ఉంచండి. శరీరం పై భాగాన్ని కుడి వైపుకు తిప్పుతూ, కుడి చేతితో కుర్చీ వెనుక భాగాన్ని పట్టుకోండి. ఛాతీని ముందుకు ఉంచి, వెన్నెముకను నిటారుగా సాగదీయండి.
ప్రయోజనాలు: శ్వాస లోతుగా తీసుకుంటూ 5-8 సెకన్ల పాటు అలాగే ఉంచండి. ఇరువైపులా 3-5 సార్లు పునరావృతం చేయండి. ఇది వెన్నెముకపై ఉన్న ఒత్తిడిని తక్షణమే తగ్గిస్తుంది. గుండె, ఊపిరితిత్తుల వైపు



శక్తి ప్రవాహాన్ని పెంచుతుంది. శరీర పై భాగాన్ని సరైన స్థితికి తెచ్చి, విశ్రాంతినిస్తుంది.

4. నాసికాగ్రహ దృష్టి (ముక్కు చివర దృష్టి):
ఎలా చేయాలి: సౌకర్యవంతమైన భంగిమలో కూర్చుని, కనురెప్పలు వాల్చకుండా ముక్కు చివరను ఎంతసేపు చూడగలిగితే అంతసేపు చూడడానికి ప్రయత్నించండి.
ప్రయోజనాలు: ఇది పూర్తయిన తర్వాత కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకోవచ్చు, లేదా అరచేతులను వేడి చేసి కళ్ళపై ఉంచుకోవచ్చు (వార్మ్ పాల్మింగ్). ఈ స్థిరత్వం, ఏకాగ్రతను పెంచుతుంది.



# మీరు ఊహించిన దానికంటే ఎక్కువ హాని కలిగించే 5 కిచెన్ వస్తువులు





మీ వంటింటి వస్తువులు మీకు తెలియకుండానే దీర్ఘకాలంలో మీ ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయా? ఇన్‌స్టాగ్రామ్‌లో విలువైన ఆరోగ్య చిట్కాలను పంచుకుంటూ ఉండే కార్డియాలజిస్ట్ డాక్టర్ అలోక్ చోప్రా, సురక్షితమైన వంటింటి వస్తువుల ప్రాముఖ్యతను ఇటీవల తెలియజేశారు. హానిచేయనివిగా కనిపించే ఐదు వంటింటి వస్తువులు కాలక్రమేణా తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తాయని డాక్టర్ చోప్రా నొక్కి చెప్పారు. "మీ వంటగది సురక్షితంగా ఉందని అనుకుంటున్నారా? ఈ 5 రోజువారీ వస్తువులు మీరు అనుకున్నదానికంటే ఎక్కువ హాని కలిగించవచ్చు. మీరు దేనితో వండుతున్నారో తిరిగి ఆలోచించాల్సిన సమయం ఇది. మీరు ఏమి వండుతున్నారో మాత్రమే కాదు" అని ఆయన రాశారు.

నాన్‌స్టిక్ ప్యాన్‌లు:
ఈ పాత్రలను ఎక్కువగా వేడి చేయడం వల్ల విషపూరిత పొగలు వెలువడతాయి. అలాగే గీతలు పడినప్పుడు హానికరమైన రసాయనాలు ఆహారంలో కలవవచ్చు. PFOA, PFAS వంటి రసాయనాలు ఉన్న పాత ప్యాన్‌లు శరీరంలో పేరుకుపోయి ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఈ రసాయనాలు హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీయడం, రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం చూపడం, దీర్ఘకాలిక విషపూరితం కావడంతో ముడిపడి ఉన్నాయి.
దీనికి బదులుగా ఏమి వాడాలి: స్టెయిన్‌లెస్ స్టీల్, కాస్ట్ ఇనుము (ఇనుప), గాజు లేదా సిరామిక్ పాత్రలను ఎంచుకోండి. ఎక్కువ వేడి చేయడం లేదా పాడైన ప్యాన్‌లను వాడటం మానుకోండి.

అల్యూమినియం ఫాయిల్:
పుల్లని ఆహారాలతో లేదా అధిక ఉష్ణోగ్రతల వద్ద ఉపయోగించినప్పుడు, అల్యూమినియం ఫాయిల్ నుండి లోహం మీ ఆహారంలో కలవవచ్చు.



దీర్ఘకాలికంగా దీనికి గురికావడం నాడీ సంబంధిత సమస్యలు, అల్జీమర్స్ ప్రమాదాన్ని పెంచుతుందని తేలింది. ఇది జీవఅధోకరణం చెందదు కాబట్టి, మీ ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా హానికరం.
దీనికి బదులుగా ఏమి వాడాలి: బేకింగ్ కోసం పార్చ్‌మెంట్ పేపర్‌ను, ఆహారాన్ని వేడి చేయడానికి, నిల్వ చేయడానికి గాజు లేదా సిలికాన్ కంటైనర్‌లను ఉపయోగించండి.

ప్లాస్టిక్ ఆహార కంటైనర్‌లు:
చాలా ప్లాస్టిక్‌లు, ముఖ్యంగా పాతవి లేదా నాసిరకం ప్లాస్టిక్‌లు, BPA, BPS, ఫథలేట్స్ వంటి హానికరమైన రసాయనాలను విడుదల చేస్తాయి. మైక్రోవేవ్‌లో పెట్టినప్పుడు లేదా నూనె, పుల్లని లేదా వేడి ఆహారాలతో ఉపయోగించినప్పుడు ఇది ఎక్కువగా జరుగుతుంది. ఇవి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతాయి,



రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. నల్ల ప్లాస్టిక్ తరచుగా రీసైకిల్ చేసిన ఎలక్ట్రానిక్ వ్యర్థాల నుండి తయారవుతుంది. ఇది విషపూరితం కావచ్చు.
దీనికి బదులుగా ఏమి వాడాలి: ఆహారాన్ని గాజు, సిరామిక్ లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ కంటైనర్‌లలో నిల్వ చేయండి. మైక్రోవేవ్ సేఫ్ అని చెప్పే ప్లాస్టిక్‌తో సహా ఎలాంటి ప్లాస్టిక్‌ను మైక్రోవేవ్‌లో పెట్టడం మానుకోండి.

ప్లాస్టిక్ వంట సామాగ్రి (గరిటెలు, స్పూన్లు):
వేడికి గురైనప్పుడు, ప్లాస్టిక్ గరిటెలు, స్పూన్‌ల నుండి ఫ్లేమ్ రిటార్డెంట్లు, రంగులు, మైక్రోప్లాస్టిక్స్ వంటి విషపూరిత పదార్థాలు వెలువడతాయి. ఇవి మీ ఆహారంలోకి చేరి శరీరంలో పేరుకుపోయి, మంటను, దీర్ఘకాలిక విషాన్ని కలిగిస్తాయి. ప్లాస్టిక్‌తో తరచుగా వండటం ఈ ప్రమాదాన్ని పెంచుతుంది.
దీనికి బదులుగా ఏమి వాడాలి: చెక్క, వెదురు లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ సామాగ్రితో మార్చండి. ఇవి సురక్షితమైనవి, ఎక్కువ కాలం మన్నుతాయి. పర్యావరణానికి కూడా మంచివి.

గ్యాస్ స్టవ్‌లు:
గ్యాస్ స్టవ్‌లు బెంజీన్, నైట్రోజన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి ఇండోర్ వాయు కాలుష్యాలను విడుదల చేస్తాయి. ఇవి ఆస్తమా, శ్వాసకోశ అంటువ్యాధులు, క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా పెంచుతాయి. వెంటిలేషన్ సరిగా లేని ఇళ్లలో, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు.
దీనికి బదులుగా ఏమి వాడాలి: పరిశుభ్రమైన గాలి కోసం ఇండక్షన్ లేదా ఎలక్ట్రిక్ కుక్‌టాప్‌లను ఉపయోగించండి. కనీసం, వెంటిలేషన్‌ను మెరుగుపరచండి. కిటికీలు తెరవండి. ఎగ్జాస్ట్ ఫ్యాన్ లేదా చిమ్నీని ఏర్పాటు చేయండి. వీలైతే ఎయిర్ ప్యూరిఫైయర్‌ను ఉపయోగించండి.

# రౌద్రం + సున్నితత్వం = రుద్ర

ఓ గొప్ప లక్ష్యాన్ని నెరవేర్చేందుకు జన్మించిన వాడు రుద్ర. పైకి చమత్కారిలా.. సున్నితంగా కనిపించినా అప్పటికప్పుడు ఉగ్రరూపం దాల్చగలడు. మరి ఈ రుద్ర ఎవరు? తను నెరవేర్చాల్సిన ఆ లక్ష్యం ఏంటి? దానికోసం కాలాల్ని దాటి ప్రపంచాన్ని చుట్టేస్తూ చేసిన సాహసాలేంటి? తెలియాలంటే 'వారణాసి' చూడాల్సిందే. మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రమిది. శ్రీ దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆదివారం మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి రుద్రగా తన కొత్త లుక్స్ రెండింటిని విడుదల చేశారు. ఓ పోస్టర్‌లో మహేశ్ దట్టమైన అడవిలో ఓ తెప్పపై విశ్రాంతి తీసుకుంటున్నట్లుగా.. మరో ఫొటోలో కెన్యాలోని మసాయి మారా విశాలమైన మైదానంలో జిరాఫీలు, క్రూర మృగాల మధ్య నిల్చున్నట్లుగా కనిపించారు.

ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి స్పందిస్తూ.. "రుద్ర తన జీవితం కంటే చాలా పెద్ద లక్ష్యాన్ని నెరవేర్చడానికి జన్మించాడు. అతను కోరుకోకుండానే ఓ గొప్ప విధి తన భుజాలపై పడింది. తను చమత్కారి, సున్నితమైనవాడు. అదే సమయంలో ఉగ్రరూపం దాల్చగలడు. ఇలా ఒకేసారి రౌద్రంగా, సున్నితంగా నటించగలవారు చాలా తక్కువ మందే ఉంటారు. అలాంటి ఈ పాత్రకి మహేశ్ అద్భుతంగా ప్రాణం పోశారు. ఈ ఫ్రేమ్‌లు మా ఆఫ్రికా షెడ్యూల్‌లో తీసినవి. ఏ సెట్ ఇవ్వలేని ఓ అద్భుతాన్ని ఆ నేల మాకు అందించింది. కిలిమంజారో, మసాయి మారా ప్రాంతాల్లో షూట్ చేస్తున్నప్పుడు నేనెంతో ఆశ్చర్యపోయాను. కొన్ని ఉదయాలైతే మా కళ్ల ముందు ఉన్న దృశ్యాల్ని ఆఖరికి 1.43:1 ఐమాక్స్ ఫ్రేమ్ కూడా బంధించలేదేమో అనిపించేది" అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మహేశ్ ఈ సినిమాలో రుద్రగా, శ్రీరాముడిగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఇక మందాకినిగా ప్రియాంక, కుంభగా పృథ్వీరాజ్ నటిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.





# జాన్వీ.. శ్రీలీల.. ఓ ప్రేమకథ?

ఒకరేమో స్టెప్పులతో సినీ ప్రియుల్ని అదరగొడితే.. మరొకరేమో అందం, అభినయంతో కుర్రకారుని ఉర్రూత్రలూగిస్తారు. ఇలాంటి ఇద్దరు అందాల భామలు.. ఒకే వ్యక్తితో ప్రేమలో పడితే ఎలా ఉంటుంది. థియేటర్లలో ప్రేక్షకులకు పండగే కదా! ఇదంతా కథానాయికలు శ్రీలీల, జాన్వీ కపూర్‌ల గురించే. ఈ తారలిద్దరూ కలిసి ఓ రొమాంటిక్ చిత్రంలో నటించబోతున్నారట. గునీత్ మోంగా, ఏక్తా కపూర్ నిర్మాణంలో రాబోతున్న ఈ సినిమా కోసం ప్రస్తుతం కథానాయకుడిని ఖరారు చేసే పనిలో చిత్రబృందముందని సమాచారం. "ఉమేశ్ బిస్ట్ రాబోయే చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాది అక్టోబరు లేదా నవంబరులో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నార"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.





# మలయాళంలోకి రుక్మిణి

గతేడాది 'మదరాసి', 'కాంతార చాప్టర్ 1' లాంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో మెరిసి.. ప్రేక్షకుల్ని అలరించింది అందాల తార రుక్మిణీ వసంత్. త్వరలోనే 'టాక్సిక్' సినిమాతో సినీప్రియుల్ని పలకరించడానికి సన్నద్ధమవుతోంది. భాషతో సంబంధం లేకుండా అలరిస్తున్న ఆమె ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. కథానాయకుడు నివిన్ పాలీ తదుపరి చిత్రంలో రుక్మిణి నాయికగా నటిస్తున్నట్లు ఆదివారం సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది చిత్రబృందం. 'జయ జయ జయ జయ హే' చిత్రంతో మంచి హిట్ అందుకున్న దర్శకుడు నషిద్ ఫామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మార్టిన్ ప్రక్కట్ ఫిల్మ్స్, పాలీ జూనియర్ పిక్చర్స్ నిర్మిస్తున్నాయి. రొమాంటిక్ కామెడీగా రూపొందుతున్న ఈ సినిమాలో అజు వర్గీస్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

# 40 ఎకరాల బీడు భూమి..

# అత్యాధునిక క్రికెట్ శిక్షణ కేంద్రంగా రూపాంతరం!





గత కొద్ది రోజులుగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (CoE) పేరు మార్మోగుతోంది. ఆటగాళ్ల గాయాల విషయంలో సరైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. తాజాగా ఈ సీవోఈను బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా, బోర్డు అధికారులు సందర్శించారు. సీవోఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. క్రీడాకారులకు అన్ని సదుపాయాలను కల్పించడంలో లక్ష్మణ్ కృషి అభినందనీయం. అయితే, దాదాపు 40 ఎకరాల బంజరు భూమిని సకల సదుపాయాలతో కూడిన 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'గా తీర్చిదిద్దడంలో బీసీసీఐ మాజీ కార్యదర్శి.. ప్రస్తుత ఐసీసీ ఛైర్మన్ జై షా పాత్ర అత్యంత కీలకం. ఇదే విషయాన్ని తాజాగా బీసీసీఐ కార్యదర్శి సైకియా, సీవోఈ హెడ్ లక్ష్మణ్ గుర్తు చేసుకున్నారు.

"సీవోఈ ఇంత స్థాయిలో అభివృద్ధి కావడానికి జై షా వేసిన అడుగులే కారణం. కార్యదర్శిగా ఉన్నప్పుడు.. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో అందరితో చర్చించి ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ఆయనదే కీలక పాత్ర. యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని పట్టుబట్టారు. పాత జాతీయ క్రికెట్ అకాడమీ స్థానంలో అద్భుతమైన సదుపాయాలు కలిగిన ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను నిర్మించాం. ప్రాజెక్టును ప్రారంభించే క్రమంలో చాలా నిబంధనలను పాటించాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఎదురైన చట్టపరమైన అడ్డంకులను తొలగించడానికి జై షా వ్యక్తిగతంగా చాలాసార్లు ఇక్కడికి వచ్చారు. దాదాపు 40 ఎకరాల బీడు భూమిని క్రమబద్ధీకరించుకొనే క్రమంలో సవాళ్లు ఎదురయ్యాయి. నిరుపయోగంగా ఉన్న ఈ భూమిని తిరిగి తీసుకోవాలని కొందరు స్థానికులు భావించారు. మేం అనుకొన్న సమయానికి పనిని ప్రారంభించడానికి ల్యాండ్ ప్రక్రియ అడ్డంకిగా మారింది. అప్పుడు జై షా కృషి మరువలేనిది. అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ఇబ్బందులను తొలగించి మార్గం సుగమం చేశారు" అని దేవజిత్ గుర్తు చేసుకున్నారు. "కేవలం రెండేళ్లలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో కూడిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సెంటర్ సిద్ధం చేయగలిగాం. ఇందులో ఎక్కువ క్రెడిట్ జై షాదే. ఈ ప్రాజెక్టు పట్ల చాలా ఆసక్తి చూపించారు. ఆర్కిటెక్ట్స్, ఎల్ అండ్ టీ టీమ్‌తో నిరంతరం సంప్రదింపులు జరిపారు. ఇదంతా నేను దగ్గర నుంచి చూశా" అని వీవీఎస్ లక్ష్మణ్ తెలిపాడు. 2022 ఫిబ్రవరి 14న ఈ నిర్మాణ పనులు ప్రారంభించగా.. 2024 నవంబర్‌లో సీవోఈ కార్యకలాపాలు మొదలైన సంగతి తెలిసిందే.



# ఎంపిక విషయంలో మేనేజ్‌మెంట్ ఆలోచన వేరు:






దేశవాళీలో నిలకడగా ప్రదర్శన చేస్తున్నప్పటికీ వెటరన్ పేసర్ షమీ వైపు టీమ్‌ఇండియా సెలక్టర్లు మాత్రం దృష్టిసారించడం లేదు. వచ్చే వన్డే ప్రపంచ కప్ సన్నద్ధత కోసం ఇప్పటికే 15 మందితో కూడిన యువ బౌలర్ల జాబితాను మేనేజ్‌మెంట్ సిద్ధం చేసినట్లు వార్తలు వచ్చాయి. అందులో షమీకి చోటు దక్కలేదని సమాచారం. స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా గైర్హాజరీలోనైనా షమీకి ఛాన్స్ వస్తుందనుకుంటే వీలుపడటం లేదు. పలు సందర్భాల్లో షమీ కూడా దీనిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మేనేజ్‌మెంట్ ఆలోచనలు భిన్నంగా ఉన్నా.. ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని షమీకి సూచించాడు. అలాగే యువ క్రికెటర్లకూ కీలక సూచనలు ఇచ్చాడు.

"క్రికెటర్‌గా ఎలా ముందుకు వెళ్లాలనేది మీ నిర్ణయం. మ్యాచులు ఆడుతూ.. అందులో రాణిస్తూ ఉంటే సెలక్షన్‌కు అందుబాటులో ఉన్నట్లే. నేను చూసే విధానం ఎప్పుడూ ఇలానే ఉంటుంది. మేనేజ్‌మెంట్ ఆలోచన భిన్నంగా ఉండొచ్చు. కానీ, మీరు ఎలా ఆలోచిస్తారనేదే ముఖ్యం. జట్టులో భాగస్వామి కావాలనుకోవడంలో తప్పు లేదు. అందుకోసం ఏం చేయాలి? షమీలా కష్టపడుతూ ఉండాలి. ఇప్పటికీ అతడు ఆడుతూనే ఉన్నాడు. జాతీయ జట్టులో అవకాశం వచ్చినా రాకపోయినా పోరాటం మాత్రం ఆపలేదు. ఛాన్స్ రాలేదని ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదు" అని జహీర్ వ్యాఖ్యానించాడు.

ఆటగాళ్ల గాయాలపై..

"క్రీడల్లో ఆటగాళ్లకు గాయాలు కావడం సహజం. ప్రతి ప్లేయర్ ప్రయాణంలో అవి తప్పవు. ఇప్పుడు చాలా మంది వర్క్‌లోడ్ గురించి మాట్లాడుతున్నారు. కానీ.. టోర్నీలు, మ్యాచులకు తగినట్టుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఎవరైనా పేసర్ గాయం కారణంగా ఇబ్బందిపడుతుంటే వెంటనే చర్యలు తీసుకోవాలి. గాయానికి గల కారణాలను విశ్లేషించాలి. ఏం చేస్తే మళ్లీ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉంటాయో ఆలోచన చేయాలి. మన చేతుల్లో ఉండే వాటిని నియంత్రించొచ్చు" అని జహీర్ అభిప్రాయపడ్డాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314